ప్రజాశక్తి
శుక్రవారం 5 డిసెంబర్ 2025 8 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా



# రోడ్డున పడేశారు...

- విద్యాధరపురంలో ఇళ్లు కూల్చివేతపై బాధితుల ఆగ్రహం
- సుప్రీం కోర్టు ఉత్తర్వులను పట్టించుకోని అధికారులు

**ప్రజాశక్తి-విజయవాడ సిటీ**

వారంతా సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు... ఏ కాల్వగట్లను ఆక్రమించలేదు... ఏ ప్రభుత్వ పోరంబోకు స్థలంలోను ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు... వారి సంపాదనలో పైసాపైసా కూడబెట్టి సొంతింటి కల నిజం చేసుకోవాలనే తపనతో విద్యాధరపురం జోజినగర్‌లోని 180 గజాల ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేశారు... పక్కాగా రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇళ్ల నిర్మాణం చేపట్టి రెండు దశాబ్దాలుగా జీవిస్తున్నారు... విజయవాడ నగర పాలక సంస్థకు అన్ని రకాల పన్నులతో పాటు ఇంటి పన్ను నీటి పన్నుతో పాటు కరెంటు బిల్లులు చెల్లిస్తున్న వారే.... అయితే బుధవారం వారందరి ఇళ్లను అన్యాయంగా కూల్చివేశారు. విజయవాడ భవానీపురం జోజినగర్ కరెంట్ ఆఫీస్ రోడ్డులో 2.17 ఎకరాల స్థలాన్ని 2001లో అబ్దుల్ ముజీద్ ప్లాట్లుగా విభజించి 42 మందికి విక్రయించారు. దీంతో స్థల యజమానులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 17 మంది ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2017న శ్రీ లక్ష్మీ కోపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ఆ స్థలం తమదిగా పేర్కొంటూ కోర్టును ఆశ్రయించింది. ఇరువర్గాల వాదోపవాదనల అనంతరం విజయవాడ కోర్టు శ్రీ లక్ష్మీ రామా కోపరేటివ్ బిల్డింగ్ సొసైటీ స్థలంగా తీర్పు ఇచ్చింది. అయితే గత మూడు నెలల క్రితం సొసైటీదారులు ఇళ్ల స్థలాలను ఖాళీ చేయాలని చెప్పడంతో ప్లాట్ల యజమానులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సుప్రీం కోర్టు గత నెల మూడో తేదీ స్టే ఆర్డర్ ఇచ్చింది. ఈ నెల 31వ తేదీ వరకు యథావిధిగా కొనసాగాలని ప్లాట్ల యజమానులకు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు సొసైటీదారులు (మిగతా 2లో)



ఇళ్లు కూల్చివేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు బాబూరావు

## ఇళ్లు కూల్చివేతపై సమగ్ర విచారణ

- బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు డిమాండ్

**ప్రజాశక్తి-విజయవాడ సిటీ**

భవానీపురం జోజినగర్ కరెంట్ ఆఫీస్ వద్ద 42 ఇళ్లను అన్యాయంగా కూల్చివేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధితులను న్యాయం చేసి నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. సిపిఎం బృందం గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధితులను పరామర్శించి సంఘీభావం తెలిపింది. 20 సంవత్సరాల క్రితం రిజిస్ట్రేషన్ల ద్వారా కొనుగోలు చేసి బ్యాంకు రుణం, విఎంసి ప్లాన్ తీసుకుని ఇళ్లు నిర్మించుకున్నామని, కొంతమంది తప్పుడు రిజిస్ట్రేషన్లతో తమ భూమిని హస్తగతం చేసుకునేందుకు చూస్తున్నాయని సిపిఎం నాయకుల ఎదుట బాధితులు వాపోయారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ఇళ్లు లేని వారికి ఇళ్లిస్తామని ప్రభుత్వాలు చెబుతూ, విద్యాధరపురంలో 42 ఇళ్లను కూల్చి ఆయా కుటుంబాలను రోడ్డు పాలు చేయడం అమానీయమని అన్నారు. (మిగతా 2లో)

## ఎంఎల్ఏ కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన

**ప్రజాశక్తి-విజయవాడ సిటీ:** భవానీపురం జోజినగర్ ఇళ్లు కూల్చివేతపై రెండో రోజు గురువారమూ ఆందోళన కొనసాగింది. చట్టపరంగా అన్ని అనుమతులు ఉన్నా తమను రోడ్డున పడవేశారంటూ బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఇళ్లు నేలమట్టం చేసి 24 గంటలు కావస్తున్నా తమను పట్టించుకోవడంలేదంటూ పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద గురువారం నిరసనకు దిగారు. న్యాయం చేయాలంటూ వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లినా ఎవరూ పట్టించుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకానొక దశలో కార్యాలయం ఎదుట బాధితులు బైఠాయించి ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుజనా మిత్రా సభ్యులు ఎమ్మెల్యే కార్యాలయం తలుపులు మూసివేయడంపై మండిపడ్డారు. దీంతో పరిస్థితి చేయి దాటిపోతుందని గమనించిన ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్ మరికొంతమంది నేతలు బాధితులతో మాట్లాడి సమస్యను ఎమ్మెల్యే సుజనాచౌదరి దృష్టికి తీసుకెళ్తామంటూ హామీనివ్వడంతో ఆందోళన సద్దుమణిగింది. అంతకుముందుకు ఇళ్లు కూల్చివేత సమయంలో కొంతమంది పోలీసు సిబ్బంది, న్యాయవాదులు తమ పట్ల దురుసుగా, అసభ్యకరంగా వ్యవహరించారని భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఎదుట పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



భవానీపురం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

## యువశక్తే దేశానికి సంపద

- మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు
- కృష్ణా తరంగ్-2025 ప్రారంభం



కృష్ణా తరంగ్‌ను ప్రారంభిస్తున్న వెంకయ్యనాయుడు, రవీంద్ర, బుద్ధప్రసాద్

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్**

యువతే దేశానికి నిజమైన సంపదని, యువత సృజనాత్మకత, కొత్త ఆవిష్కరణలు, స్థాపనల ద్వారా దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తారని, వారిని చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి సరైన మార్గంలో నడిపిస్తే దేశం ఉన్నత శిఖరాలను చేరుకుంటుందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. రుద్రవరంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో కృష్ణా తరంగ్-2025ను మంత్రి కొల్లు రవీంద్ర, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ యువతలో తగిన సమయంలో స్ఫూర్తిని నింపి మార్గనిర్దేశం చేస్తే దేశానికి గొప్ప సంపదగా తయారవుతారని పేర్కొన్నారు. అవసరం మేరకే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని, పరిమితికి మించి ఉపయోగిస్తూ బానిసలుగా మారి సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. ఆ సమయాన్ని లక్ష్యసాధనకు, నైపుణ్య అభివృద్ధికి ఉపయోగించాలని విద్యార్థులకు హితువు పలికారు. చదువుతో పాటు పాఠ్యేతర కార్యకలాపాలు కళలు, క్రీడలకు సమయం కేటాయించాలని, అవి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఉద్యోగాల భర్తీలో తెలుగు భాషను తప్పని సరి చేయాలని, ఆ దిశగా తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యవస్థలో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజల కోసం చేసే పరిపాలనలో అందరికీ అర్థమయ్యే రీతిలో ఉత్తర ప్రత్యుత్తరాల్లో పరిపాలన భాషగా తెలుగును ఉపయోగించాలని ఆకాంక్షించారు. మాతృమూర్తిని, మాతృభాషను, మాతృదేశాన్ని మరువకూడదన్నారు. భారతదేశం త్వరలో (మిగతా 2లో)

## లోకో సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి-విజయవాడ సిటీ**

దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న రైల్వే లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి డిమాండ్ చేశారు. ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం చేపట్టిన 48 గంటల నిరాహార దీక్ష గురువారం ముగిసింది. విజయవాడ రైల్వే డిఆర్ఎం కార్యాలయం ముందు దీక్షా శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు దయా రమాదేవి, ముజఫర్ అహ్మద్, ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ సందర్శించారు. దీక్షలో పాల్గొన్న రన్నింగ్ స్టాఫ్‌కు పండ్ల రసం అందజేసి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ సర్కార్ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ రైల్వేను ప్రైవేటీకరణ చేయాలని (మిగతా 2లో)



**మొదటిపేజీ తరువాయి**

## రోడ్డున పడేశారు...

జెసిబిలు, ప్రొక్లెయినర్లతో న్యాయవాదులు, పోలీసులను వెంటబెట్టుకుని ఇళ్ల స్థలాలు ఖాళీ చేయాలనడంతో బాధితులు అయోమయానికి గురయ్యారు. సుప్రీం కోర్టు స్టే అనుసరించి ఈ నెల ఆఖరి వరకు గడువు ఉందని చెబుతున్నా వినిపించుకోకుండా ఇళ్లల్లోని వస్తువులను సైతం తీసుకొనే వ్యవధి ఇవ్వకుండా ఇళ్లను నేలమట్టం చేయడంతో బాధితులు రోడ్డున పడ్డారు.

**న్యాయం జరిగే వరకు పోరాటం : నాగరాజు**



స్థలాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి ఆ రుణంతో ఇల్లు నిర్మాణం చేపట్టాం. భవనం కూల్చే సమయానికి సుప్రీం కోర్టు స్టే వచ్చిందని మొబైల్‌లో ఉన్న కాపీని పోలీస్ అధికారులకు, కోర్టు సిబ్బందికి చూపించినా తమ మొర ఆలకించకుండా ఇళ్లను నేలమట్టం చేశారు. సంఘటన జరిగి 24 గంటలు కావస్తున్నా మా వైపు కన్నెత్తి చూసిన వారు లేరు. మాకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తాం.

**బుద్ధి చెబుతాం : మురళీకృష్ణ**



పకడ్బందీగా రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇంటి పన్ను, నీటి పన్ను కరెంటు బిల్లులు చెల్లిస్తున్నాం. అయినా ఈ స్థలం మాదికాదంటూ ధ్వంసం చేశారు. భూ బకాసురులు, రాజకీయ నేతలు నకిలీ సొసైటీగా ఏర్పడి స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారు. చట్టపరంగా సొసైటీ సభ్యులకు గట్టి బుద్ధి చెబుతాం.

## లోకో సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

చూస్తుందని, దీన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. రైల్వే సిబ్బందికి అమలు చేస్తున్న కొత్త పింఛను విధానాన్ని రద్దు చేయాలని కోరారు. రన్నింగ్ సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడంతో పాటు డిఎ 50 శాతం దాటినందున కిలో మీటరేజ్ అలవెన్సును 25 శాతం పెంచాలని, కోచింగ్ రైళ్లకు ఆరు గంటలు, గూడ్స్ రైళ్లకు ఎనిమిది గంటల డ్యూటీని పరిమితం చేయాలన్నారు. రాత్రి డ్యూటీలు వారంలో రెండ్రోజులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రైల్వే డిఆర్ఎం, ఏడిఆర్ఎం, ఇతర రైల్వే అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ డివిజన్, జోనల్, సెంట్రల్ నాయకులు ఎం.వెంకటేషన్, కె.రామకృష్ణ, ఆర్.వి.రాము, బిసిఎస్ఎస్ రావు, బి.గౌరీ ప్రసాద్, ఎన్ఎన్వి రావు, మూర్తి, ఎమ్‌డి ఆయాజ్ పాష, వి.వెంకటేషన్, ఎస్.గురుమూర్తి, జి.వెంకటేశ్వర్లు, కె.రమేష్, జి.చిన్నాజీ, కే.రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

## యువశక్తే దేశానికి సంపద

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఆయన ఆకాంక్షించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ కృష్ణా తరంగ్ ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి, పోటీతత్వాన్ని ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. జిల్లాకు ఎంతో ప్రతిష్టాత్మకమైన కృష్ణా విశ్వవిద్యాలయంలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కృష్ణా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చేసిన కృషి, తెలుగు భాష, సంస్కృతి సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కూన రాంజీ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఉష, విశ్వవిద్యాలయం రెక్టర్ బసవేశ్వరరావు, ప్రోగ్రామ్ కన్వీనర్ దిలీప్, డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, గొర్రెపాటి గోపీచంద్, మాజీ జెడ్పిటిసి లంకే నారాయణ ప్రసాద్, పీవీ గజేంద్రరావు, సోడిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో అందుబాటులోకి ఏడు ఇసుక రీచ్‌లు

### ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ




జిల్లాలో అత్యంత పారదర్శకంగా ఇసుక విధానాన్ని అమలు చేయడం జరుగుతోందని.. ఇకపైనా ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇసుక సరఫరా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, త్వరలో ఏడు కొత్త రీచ్‌లను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.గురువారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయం నుంచి 6వ జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం వర్చువల్‌గా జరిగింది. ఈ సమావేశంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇసుక, పట్టా భూముల్లో ఇసుక తొలగింపు, కొత్త రీచ్‌లకు సంబంధించి అనుమతుల ప్రక్రియ, తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా కాకుండా తీసుకుంటున్న చర్యలు తదితరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రస్తుతం తొమ్మిది రీచ్‌ల పరిధిలో 7.27 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. కష్ణా, మున్నేరు పరిధిలో జగ్గయ్యపేట మండలంలో రెండు, చందర్లపాడు మండలంలో రెండు, కంచికచెర్ల మండలంలో 3 కొత్త రీచ్‌లకు సంబంధించిన ప్రక్రియ చివరి దశలో ఉందన్నారు. పట్టా భూముల్లో మేట వేసిన ఇసుక తొలగింపునకు 34 దరఖాస్తులు వచ్చాయని.. వీటిలో 26 దరఖాస్తులను కమిటీ ఆమోదించినట్లు తెలిపారు. రెండు దరఖాస్తులకు ఇప్పటికే పర్యావరణ అనుమతులు వచ్చాయని.. త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్నామన్నారు. తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా కాకుండా పోలీసు శాఖ సహకారంతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని.. అక్రమ రవాణాకు సంబంధించి 248 కేసుల నమోదుతో పాటు 440 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు కమిటీకి వివరించారు. జిల్లాలో ఇసుక విధానం అమలుకు సంబంధించి ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల సంతప్తి స్థాయి బాగుందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, మైన్స్ డీడీ శ్రీనివాసరావు, సమన్వయ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇళ్లు కూల్చివేతపై సమగ్ర విచారణ

వైసిపి ప్రభుత్వ హయాంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయించి, నేడు కూటమి పరిపాలనలో ఇళ్లను కూల్చి వేయడం వెనుక పెద్ద ఎత్తున భూ కుంభకోణం ఉందన్నారు. సుప్రీం కోర్టు స్టే ఆర్డర్ అమలు చేయకుండా ఇళ్లను కూల్చివేయడం రాజ్యాంగ ఉల్లంఘన అన్నారు. సమగ్ర విచారణ చేసి తప్పుడు సొసైటీ రిజిస్ట్రేషన్లు జరిగిన వాటిని వెంటనే రద్దు చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల పోరాటానికి సిపిఎం పూర్తి మద్దతు తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బి.సత్యబాబు, జిల్లా కమిటీ సభ్యులు ఈవి నారాయణ. నగర కమిటీ సభ్యులు కె.సూరిబాబు. జి.వెంకట్రావు, ఎమ్‌డి మస్తాన్, ఎమ్‌డి రఫీ తదితరులు పాల్గొన్నారు.



**మహారాజశ్రీ 4వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) విజయవాడ**
**I.A.No. 291/2024**
**O.S.No. 2120/2021**

Between:
INDIAN OVERSEAS BANK, GANDHINAGAR BRANCH, VIJAYAWADA Rep.by Its Sr. Manager ...Petitioner
And
1) Subrahmanyam Sridevi, W/o. AS Gupta, Prop: Sreedevi Enterprises, R/o. 401, Ram's Village 4th Floor, Opp. Urdu School, 5th lane, Pandaripuram, Ashoknagar, Vijayawada-7.
2) AS Gupta, R/o. 401, Ram's Village 4th Floor, Opp. Urdu School, 5th lane, Pandaripuram, Ashoknagar, Vijayawada-7.

పై నంబరు పిటీషనులో మీరు 1 మరియు 2వ రెస్పాండెంట్లు అయి ఉన్నారు. శ్రీ కోర్టు వారు ఎన్నిమార్లు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కనుక శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము ది.19-12-2025 ఉ॥ 10.30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరయి అభ్యంతరములు ఉన్నచో తెలుపుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానము జరుగునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

// By Order of the Court //
ఇట్లు
**K. VENKATESWARA RAO**
Advocate
# 29-19-67A, Dornakal Road,
Suryaraopet, Vijayawada-2.
Cell: 9849141199
Vijayawada, Dt: 18-11-2025

**మహారాజశ్రీ 16వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, నందిగామ**
**O.S.NO.7 OF 2020**

**BETWEEN:**
అన్నాబత్తిన జ్యోతి ... వాది
AND
జవ్వాజి సుమలత వగైరాలు ... ప్రతివాదులు
1. జవ్వాజి వెంకటరమణ, తండ్రి:వేంకటేశ్వరరావు, వయసు 56 సం.లు., డోర్.నెం.8-14-45, M మార్ట్ పక్క సందు, వించిపేట, విజయవాడ, కృష్ణా (NTR) జిల్లా - 520001. ... 6 వ ప్రతివాది
2. జవ్వాజి వసుందర, భర్త: M. చంద్రశేఖర్ రావు, తండ్రి వెంకట రమణ, వయసు 36 సం.లు., డోర్. నెం.8- 14-45, M మార్ట్ పక్క సందు, వించిపేట, విజయవాడ, కృష్ణా (NTR) జిల్లా - 520001. ... 7వ ప్రతివాది
3. జవ్వాజి సునీల్, తండ్రి:వెంకట రమణ, వయసు 34 సం.లు., డోర్.నెం.8-14-45, M మార్ట్ పక్క సందు, వించిపేట, విజయవాడ, కృష్ణా (NTR) జిల్లా - 520001. ... 8 వ ప్రతివాది

మీరు ఇరువురు పై దావాలో 6వ, 7వ మరియు 8వ ప్రతివాదులై ఉన్నారు. పై దావా మీ హాజరు కొరకై 15.12.2025వ తేదిన వాయిదా అయి ఉన్నది. ది.15.12.2025న మీరు స్వయముగా కానీ లేదా వకీలు గారి ద్వారా కానీ ఉదయం 10 గంటల 30 నిమిషములకు మహారాజశ్రీ 16వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, నందిగామ నందు హాజరు కావలయును. లేని యెడల, పై దావా మీ పరోక్షములో తీర్మానం చేయబడును. ఈ నోటీసు మహారాజశ్రీ 16వ అదనపు జిల్లా జడ్జి, నందిగామ వారి ఉత్తర్వుల ప్రకారం జారి చేయటమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది.15.12.2025

సుంకర రాజేంద్ర ప్రసాద్,
దర్శి అర్జున,
కలతోటి క్రాంతి కుమార్,
న్యాయవాదులు,
నందిగామ

నందిగామ
04.12.2025

**ప్రకటన**

**మహారాజశ్రీ విజయవాడ 12 వఅదనపు జిల్లా కోర్టులో**
**M.V.O.P. No. 91/2025**

Between :
Velivela Rama Devi and another ...Petitioners
AND
N.Ranjith Kumar and 2 others ... Respondents

**మొదటి ప్రతివాది** : N.Ranjith Kumar, S/o N.Gandhi, Hindu aged 39 years, residing at D.No. 16-148, Ibrahimpatnam, NTR District - 521456

పై నెంబరులో మొదటి ప్రతివాది 23-12-2025 తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టులో హాజరై ఏ విధమైన ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో పరోక్షముగా తీర్మానించెదరు.

కోర్టువారి అనుమతితో
వాయిదా : 23-12-2025

ఇట్లు
**తుమ్మల వెంకటదాస్**
పిటీషనర్ తరపు న్యాయవాది,
విజయవాడ.
సెల్ : **9494141919**
ఫోన్ : **0866-2432517**

**ప్రకటన**

**PROCLAMATION REQUIRING THE APPEARANCE OF A PERSON ACCUSED (SECTION 82 CR.P.C)**
**మహారాజశ్రీ మూడవ అదనపు చీఫ్ జ్యుడిషల్ మేజిస్ట్రేట్ కోర్ట్ విజయవాడ**
**C.C.No.70/2021**

**Between**
M/s.శ్రీ గోకులం చిట్ & ఫైనాన్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్
లీగల్ అసిస్టెంట్ తులిమెల్లి రత్న కుమారి
మరియు ... కంప్లైనంట్
గంజీ అరుణా, W/o. వీరన్న
R/o.JAMAC అపార్టుమెంటు, బ్లాక్ నెం.3, ప్లాట్ నెం.8, గ్రౌండ్‌ఫ్లోర్, APIIC కాలనీ, ఆటోనగర్, విజయవాడ-520010.
...ముద్దాయి

పై కేసు లో ఉన్న కంప్లైనంట్ కంపెనీ గంజీ అరుణా పై చెక్కు బౌన్స్ సెక్షన్ 138 నేగోసిబుల్ ఇన్స్ట్రుమెంట్ యాక్ట్ ప్రకారం కేసు వేసి ఉన్నారు. శ్రీ కోర్ట్ వారు కేసు సమ్మన్లు పంపించగా మీరు సమ్మన్లు తీసుకోని కోర్ట్ కి హాజరు అవ్వకపోవడం వలన శ్రీ కోర్ట్ వారు మీ పై అరెస్ట్ వారంట్ జారీ చేసి ఉన్నారు. మీరు మీ అడ్రస్ నందు ఎన్ని సార్లు కంపెనీ వారు, పోలీస్ వారు వచ్చిన మీరు కావాలని కనపడకుండా తిరుగుచున్నారు ఈ కేసు లో మీరు ఉద్దేశపూర్వకంగా హాజరు అవ్వకుండా ఉన్నారు. శ్రీ కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారం మీరు 09-01-2026 వ తేదీన ఉదయం 10.30 గంటలకు కోర్టుకు హాజరు అవ్వవలిసిందిగా కోరుచున్నాము. మీరు హాజరు అవ్వని పక్షంలో శ్రీ కోర్ట్ వారు మీరు కోర్ట్‌కి హాజరు అవ్వలేదు అని తీర్మానం చేసెదరు.

**వాయిదా తేదీ 09-01-2026**
**// కోర్ట్ వారి ఉత్తర్వులు ప్రకారం //**
విజయవాడ.
తేది.5/12/2025
**బెవర అచ్యుతేశ్వర్, గుండు గంగాధర్,**
**కంప్లైనంట్ తరుపు అడ్వకేట్స్.**

**ప్రకటన**

**PROCLAMATION REQUIRING THE APPEARANCE OF A PERSON ACCUSED (SECTION 82 CR.P.C)**
**మహారాజశ్రీ మూడవ అదనపు చీఫ్ జ్యుడిషల్ మేజిస్ట్రేట్ కోర్ట్ విజయవాడ**
**C.C.No.2229/2020**

**Between**
M/s.శ్రీ గోకులం చిట్ & ఫైనాన్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్
లీగల్ అసిస్టెంట్ తులిమెల్లి రత్న కుమారి
మరియు ... కంప్లైనంట్
G. రామ వెంకటేష్ S/o. దుర్గాప్రసాద్, #RRWA-0571, శ్రీదేవిబార్ వెనుక, రామకృష్ణాపురం, విజయవాడ-520011.
...ముద్దాయి

పై కేసు లో ఉన్న కంప్లైనంట్ కంపెనీ జి.రామ వెంకటేష్ పై చెక్కు బౌన్స్ సెక్షన్ 138 నేగోసిబుల్ ఇన్స్ట్రుమెంట్ యాక్ట్ ప్రకారం కేసు వేసి ఉన్నారు. శ్రీ కోర్ట్ వారు కేసు సమ్మన్లు పంపించగా మీరు సమ్మన్లు తీసుకోని కోర్ట్ కి హాజరు అవ్వకపోవడం వలన శ్రీ కోర్ట్ వారు మీ పై అరెస్ట్ వారంట్ జారీ చేసి ఉన్నారు. మీరు మీ అడ్రస్ నందు ఎన్ని సార్లు కంపెనీ వారు, పోలీస్ వారు వచ్చిన మీరు కావాలని కనపడకుండా తిరుగుచున్నారు ఈ కేసు లో మీరు ఉద్దేశపూర్వకంగా హాజరు అవ్వకుండా ఉన్నారు. శ్రీ కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారం మీరు 09-01-2026 వ తేదీన ఉదయం 10.30 గంటలకు కోర్టుకు హాజరు అవ్వవలిసిందిగా కోరుచున్నాము. మీరు హాజరు అవ్వని పక్షంలో శ్రీ కోర్ట్ వారు మీరు కోర్ట్‌కి హాజరు అవ్వలేదు అని తీర్మానం చేసెదరు.

**వాయిదా తేదీ 09-01-2026**
**// కోర్ట్ వారి ఉత్తర్వులు ప్రకారం //**
విజయవాడ.
తేది.5/12/2025
**బెవర అచ్యుతేశ్వర్, గుండు గంగాధర్,**
**కంప్లైనంట్ తరుపు అడ్వకేట్స్.**

**ప్రకటన**

**PROCLAMATION REQUIRING THE APPEARANCE OF A PERSON ACCUSED (SECTION 82 CR.P.C)**
**మహారాజశ్రీ మూడవ అదనపు చీఫ్ జ్యుడిషల్ మేజిస్ట్రేట్ కోర్ట్ విజయవాడ**
**C.C.No.74/2021**

**Between**
M/s.శ్రీ గోకులం చిట్ & ఫైనాన్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్
లీగల్ అసిస్టెంట్ తులిమెల్లి రత్న కుమారి
మరియు ... కంప్లైనంట్
బొప్పిశెట్టి విజయ్ కుమార్, S/o.గోపాల కృష్ణా, R/o. జిఆర్‌బి డూపెక్స్, జి.ఎఫ్-1, వికాస్ స్కూల్‌రోడ్డు, ప్రసాదంపాడు, విజయవాడ-521108 ...ముద్దాయి

పై కేసు లో ఉన్న కంప్లైనంట్ కంపెనీ బొప్పిశెట్టి విజయ్ కుమార్‌పై చెక్కు బౌన్స్ సెక్షన్ 138 నేగోసిబుల్ ఇన్స్ట్రుమెంట్ యాక్ట్ ప్రకారం కేసు వేసి ఉన్నారు. శ్రీ కోర్ట్ వారు కేసు సమ్మన్లు పంపించగా మీరు సమ్మన్లు తీసుకోని కోర్ట్ కి హాజరు అవ్వకపోవడం వలన శ్రీ కోర్ట్ వారు మీ పై అరెస్ట్ వారంట్ జారీ చేసి ఉన్నారు. మీరు మీ అడ్రస్ నందు ఎన్ని సార్లు కంపెనీ వారు, పోలీస్ వారు వచ్చిన మీరు కావాలని కనపడకుండా తిరుగుచున్నారు ఈ కేసు లో మీరు ఉద్దేశపూర్వకంగా హాజరు అవ్వకుండా ఉన్నారు. శ్రీ కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారం మీరు 09-01-2026 వ తేదీన ఉదయం 10.30 గంటలకు కోర్టుకు హాజరు అవ్వవలిసిందిగా కోరుచున్నాము. మీరు హాజరు అవ్వని పక్షంలో శ్రీ కోర్ట్ వారు మీరు కోర్ట్‌కి హాజరు అవ్వలేదు అని తీర్మానం చేసెదరు.

**వాయిదా తేదీ 09-01-2026**
**// కోర్ట్ వారి ఉత్తర్వులు ప్రకారం //**
విజయవాడ.
తేది.5/12/2025
**బెవర అచ్యుతేశ్వర్, గుండు గంగాధర్,**
**కంప్లైనంట్ తరుపు అడ్వకేట్స్.**

## ఎస్ఎస్‌సి ఫీజు అధికంగా వసూలు చేస్తే చర్యలు : డిఇఒ

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** ఎస్ఎస్సీ పబ్లిక్ పరీక్షలు మార్చి 2026కు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అదనపు రుసుములు వసూలు చేసిన పక్షంలో సంబంధిత పాఠశాలలపై కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే. రామారావు హెచ్చరించారు. బోర్డు విడుదల చేసిన అధికారిక నోటిఫికేషన్ ప్రకారం సాధారణ (రెగ్యులర్) అభ్యర్థుల పరీక్ష ఫీజు రూ. 185 గా నిర్ణయించామన్నారు. ఫీజును పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెల్లించవచ్చని, అదేవిధంగా విద్యార్థులు స్వయంగా కూడా ఆన్లైన్లో ఫీజు చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు స్వయంగా ఫీజు చెల్లించాలంటే వారి యూడైస్ ప్లస్ వివరాలను ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా ధవీకరించాలన్నారు. ఆన్లైన్ పేమెంట్ చేసిన విద్యార్థులు ఆ వివరాలను తమ ప్రధానోపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధిక వసూళ్ళు చేస్తున్నారని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, కొన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఇలాంటి అనధికార వసూళ్ళను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమన్నారు. అనధికార వసూళ్ళను గుర్తిస్తే ఎంఈఓ, డివైఈఓ, డిఈఓ, ఆర్జేడీఎస్ ఈలను సంప్రదించి ఫిర్యాదులు చేయాలన్నారు.



## ధాన్యం పరిశీలన

**ప్రజాశక్తి-పామర్రు :** రైతులకు ఏ కష్టం వచ్చినా వారి పక్షాన వైయస్సార్ సిపి నిలబడి పోరాటం చేస్తుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. గురువారం పామర్రు మచిలీపట్నం జాతీయ రహదారిపై రైతులు ఆరబోసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం అమ్మకాలలో రైతులు పడుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## బిసి రక్షణ చట్టం అమలు చేయాలి

**ప్రజాశక్తి-చల్లపల్లి :** బీసీలే తమకు వెన్నెముకలని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం 18 నెలలు గడుస్తున్నా నేటికీ బిసి రక్షణ చట్టం అమలు చేయకపోవడం బాధాకరమని కృష్ణా జిల్లా బిసి సంఘం ఉపాధ్యక్షుడు బొల్లా ఫణి బాబు అన్నారు. గురువారం చల్లపల్లిలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బిసిల ఓట్లతోనే చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తుంచుకోవాలన్నారు. బిసిలే తెలుగుదేశం ప్రభుత్వానికి వెన్నెముకని ఎన్నికల ముందు ప్రగల్బాలు పలికిన దేశం నాయకులు బీసీల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ఇకనైనా బీసీ రక్షణ చట్టం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గోనె సంచుల కొరత లేకుండా చర్యలు : కలెక్టర్

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** జిల్లాలో ధాన్యం సేకరణకు అవసరమైన గోతాం సంచులను సమకూర్చుకునేందుకు అన్ని విధాల ప్రయత్నిస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్‌కు తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం సేకరణ, వైద్యం ఆరోగ్యం తదితర అంశాలపై సమీక్షిం చారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కృష్ణాజిల్లాలో గోతం సంచుల కొరత ఉన్నట్లు తెలుస్తోందని దానికి సంబంధించి తీసుకున్న చర్యలను వివరించాలని కలెక్టర్‌ను కోరారు. నగరంలోని కలెక్టరేట్ నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ జిల్లాలో వరి కోతలు ఎక్కువగా ఉండటంతో ఒక కోటి గోతం సంచులు అవసరం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే 50 లక్షల గోతం సంచులను పంపిణీ చేశామన్నారు. మిల్లర్లతో సమావేశం నిర్వహించి తమిళనాడు నుండి మరో 20 లక్షల గోతం సంచులు తెప్పించామన్నారు. సీఎంఆర్ డీలర్స్ నుంచి కూడా గోతం సంచులు తెప్పించేందుకు కషి చేస్తున్నామన్నారు. ఇతర జిల్లాల నుంచి గోతం సంచులు సరఫరా అయ్యేలా సహకరించాలని ప్రధాన కార్యదర్శినీ కోరారు. దీంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంటనే స్పందిస్తూ ఇతర జిల్లాల నుండి గోతం సంచులు సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా నుంచి సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 97 మందికి కేన్సర్ పరీక్షలు


**ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని కొత్తపేట ఐదవ సచివాలయం వద్ద క్యాన్సర్ వైజి శిబిరం నిర్వహిం చారు. వేకనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి. రాహుల్ ప్రభాకర్‌తో పాటు క్యాన్సర్ పరీక్షల వాహనంలో గైనకాలజిస్ట్ డాక్టర్ పి. అలేఖ్య మహిళలకు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 97 మంది పరీక్షలు చేయించుకోగా 13 మందికి క్యాన్సర్ ఉన్నట్లు అనుమానించ్డం జరిగిందని, వారికి పరిక్షలు చేసి నిర్ధారణ కోసం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి పంపుతామనిడాక్టర్ రాహుల్ ప్రభాకర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రేడియాలజిస్ట్ డాక్టర్ డి. గీతా మాధురి స్కానింగ్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆరోగ్య పరిరక్షకులు కమ్మిలి తారక రామారావు, వైద్య సిబ్బంది పర్యవేక్షించారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

## రోశయ్యకు ఘన నివాళి

**ప్రజాశక్తి - గుడివాడ :** మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వవర్ధంతి సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఉపాధ్యక్షులు గోకవరపు సునీల్‌తో కలసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నివాళులు అర్పించారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు జవ్వాది గంగరాజు, గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవి, నాయకులు చేకూరి జగన్మోహ న్రావు, రామిదేని వేణుబాబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ:** మొవ్వ గ్రామసెంటర్లో మొవ్వ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉమ్మడిఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ ఆర్థిక శాఖామంత్రి ,తమిళనాడు మాజీ గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. మొవ్వ మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి పువ్వాడ సురేష్,వాసవి క్లబ్ ప్రెసిడెంట్ నంబూరుజగదీష్ కష్ణ, ఆర్యవైశ్య ప్రముఖులు నందిపాటిఆంజనేయులు, గార్లపాటి పవన్ కుమార్ పాల్గొన్నారు.



గుడివాడలో...

## డిప్యూటీ ఎంపిడిఒకు సన్మానం

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండల డిప్యూటీ ఎంపీడీ వోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వి. ఎలిషారావు కు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఘన సన్మానం చేశారు సచివాలయ ఉద్యోగులకు పరిచయం చేసి, సచివాలయ పనితీరు, విధి విధానాలు మరోసారి గుర్తు చేస్తూ, ప్రతి ఉద్యోగి పూర్తి సహ కారం అందించాలని ఎంపీడీవో ఎండి ఇమ్రాన్ సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో అంజనాదేవి , పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు , సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ఘంటసాల, ఎంవి కృష్ణారావులకు ఘన నివాళి



అవనిగడ్డలో...

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** ఘంటసాల వెంకటేశ్వరరావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండల వెంకట కృష్ణారావు జయంతి వేడుకలు అవనిగడ్డలో లలిత కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం వంతెన సెంటర్లోని ఎంవీ కృష్ణారావు విగ్రహానికి, ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనప రెడ్డి చంద్రశేఖర్ ఘంటసాల గీతాలు ఆలపించి స్వర నిరాజనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం. చిట్టిబాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, డిసి వైస్ చైర్మన్ బచ్చు. రఘునాథ్ ప్రసాద్, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు. ఆదినారాయణ, ఏఎంసి వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు మాదివాడ రత్నారావు, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ :** ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా మచిలీపట్నం నగరం మెయిన్ రోడ్ మున్సిపల్ పార్క్ పక్కన ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పివి ఫణి కుమార్ తో పాటు పలువురు ప్రము ఖులు, ఆయన అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ తెలుగు రైతు కష్ణా జిల్లా అధ్యక్షుడు, గోపు సత్యనారాయణ, వేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్, నరహరిశెట్టి హరికష్ణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడివాడ :** ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతి కార్యక్రమాన్ని గుడివాడ కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ బాపనయ్య చౌక్ వద్ద గల ఘంటసాల విగ్రహానికి కళాకారుల సమాఖ్య నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళులర్పించారు. కళాకారుల సమాఖ్య సంఘ గౌరవఅధ్యక్షులు మోహన్‌రెడ్డి, కళాకారులు సమైక్య అధ్యక్షులు పద్మా మైక్ బుజ్జి, నాయకులు పాత శ్యామ్, ప్రకాష్, బివి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## కూలీల రక్షణపై శ్రద్ధ తీసుకోవాలి : డిఎస్‌పి



మాట్లాడుతున్న డిఎస్‌పి

**ప్రజాశక్తి -నందివాడ :** మండలంలోని ఆక్వా సాగు చేసే ప్రతి ఒక్క రైతు వారి వద్ద కూలి పని చేసే వారిపై శ్రద్ధ తప్పనిసరిగా చూపించి వారికి విద్యుత్‌పై అవగాహన కల్పించాలని గుడివాడ డి.ఎస్.పి ధీరజ్ వినీల్ అన్నారు. నందివాడలోని కొండపల్లి కన్వెన్షన్‌లో గురువారం ఆక్వా రైతులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆక్వా రైతులు తమ చెరువుపై పనిచేసే ప్రతి ఒక్కరి బాధ్యత తీసుకోవాలన్నారు. చెరువుపై కరెంటు వైర్లపై అవగాహన కల్పించాలని, వారికి తప్పనిసరిగా లెదర్ బ్లౌజులు, సేఫ్టీ జాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని చెప్పారు. ప్రతిక్షణం సీసీ కెమెరాలు పర్యవేక్షణలో పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ సోమేశ్వరరావు, నందివాడ ఎస్సై కుడిపూడి శ్రీనివాస్, ఫైర్ స్టేషన్ సిబ్బంది, ఎలక్ట్రికల్ ఏ డి, ఏఈ ఆక్వా రైతులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ :** విద్యుత్ లైన్ల మరమ్మతులు జరుగుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సిపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. గోవిందరావు తెలిపారు. మచిలీపట్నం నగర పరిధిలో బలరామునిపేట, నిజాంపేట, జిల్లా కోర్టు వెనక, శక్తిగుడి ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించాలన్నారు.




## ఉచిత మెగా వైద్యశిబిరం

**ప్రజాశక్తి-ఘంటసాల :** స్వర సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ విజయవాడ వారి సౌజన్యంతో మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గుండె వ్యాధుల నిర్ధారణ ఉచిత మెగా వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ అరికేరి శివరామకష్ణ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె నొప్పి, గుండె బరువు, గుండె దడ, గుండె పెరగటం, గుండె కవాటాల సమస్యలు, గుండెలో రంధ్రాలు, గుండె బలహీనత, హార్ట్ ఫెయ్యిలూర్, ఆయాసంకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో ఈ వైద్యశిబిరానికి విచ్చేసి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ అన్వర్ షరీఫ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వెంకయ్యనాయుడికి సన్మానం

**ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ :** కృష్ణా యూనివర్సిటీ యంగ్ తరంగ్ కార్యక్రమానికి విచ్చేసిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుని మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ శాలువాతో సత్కరించి మెమెంటోను బహుకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, జనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షులు గడ్డంరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు




వెంకయ్యనాయుడిని సత్కరిస్తున్న బండి రామకృష్ణ

## నాగవంశం కార్పొరేషన్ చైర్మన్‌గా రమణారావు ప్రమాణ స్వీకారం



**ప్రజాశక్తి - విజయవాడ సిటీ:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు తిరిగి పునర్ వైభవం వచ్చిందని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడి లోని బిసి భవన్‌లో ఎపి నాగవంశం కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలను చట్టసభల్లోకి తీసుకువచ్చి ఎంతో గౌరవం ఇచ్చింది తెలుగుదేశం పార్టీ అని గుర్తు చేశారు. నాగవంశం కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు మాట్లాడుతూ తన ఉన్నతికి ఎంతో కృషి చేసిన ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బోండా ఉమా, గద్దె రామ్మోహన్‌రావు, సుజనా చౌదరిలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర నలుమూలల తిరిగి నాగవంశం కులంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. విజయవాడలో కమ్యూనిటీ హాల్ నిర్మాణంతోపాటు పలుచోట్ల కళ్యాణ మండపాల నిర్మాణాలకు కృషి చేస్తానని తెలిపారు. రాబోయే ఆదరణ త్రిలో సబ్సిడీ రుణాలు, అదేవిధంగా విదేశీ విద్యకు అవసరమైన రుణాలు ఇప్పించేందుకు సహాయం చేస్తానని చెప్పారు..

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా జడ్జి శ్రీనివాసరావు



**ప్రజాశక్తి- నందిగామ :** ఈ నెల 13న నందిగామలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయమూర్తి పి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన నందిగామ కోర్టులో విలేకరులతో మాట్లా డుతూ జాతీయ మెగా లోక్ అదాలత్‌లను ఇరు వర్గాల కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇరు వర్గాల కక్షిదారులు సమన్వయంతో ఆలోచించుకొని రాజీ చేసుకుంటే కలసి మెలసి సంతోషంగా ఉంటారని, దీంతో ఇరు వర్గాలకు సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులు, ఫ్యామిలీ కేసులు, ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, సివిల్ కేసులు మొదలైన కేసులను పరిష్కరించుకోవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణి బాబు, సీనియర్ న్యాయవాదులు దర్శి అర్జున్, మట్ట ప్రసాద్, కొమ్మినేని మౌళేశ్వరరావు, పి.కష్ణ ప్రసాద్ ఎం ఎల్ ఎస్ సి స్టాఫ్ గంగా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## 11 నుండి భవానీ దీక్షల విరమణ

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ :** ఇంద్రకీలాద్రి పై కొలువైయున్న దుర్గమ్మ దేవాలయంలో డిసెంబర్ 11 నుంచి భవానీ దీక్ష విరమణ కార్యక్రమం జరగనుంది. దీనికి సంబంధించి భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఈవో శీను నాయక్ ముందస్తు చర్యలో భాగంగా ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. డిసెంబర్ 11 నుంచి 15 వరకు జరిగే దీక్ష విరమణకు సంబంధించి భవానీలు అమ్మవారిని దర్శించుకోవడానికి ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేస్తున్నారు.

## రోశయ్యకు నివాళి

**ప్రజాశక్తి-విజయవాడ సిటీ:** విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో త్రిమూర్తి చౌక్‌లోని రోశయ్య విగ్రహం వద్ద ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు ఆధ్వర్యంలో గురువారం కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచినా వ్యక్తి కొణిజేటి రోశయ్యని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు వేముల హాజరతయ్య గుప్తా, సేవాదల్ అధ్యక్షులు శేగు వెంకటేశ్వరరావు, ఐవిఎఫ్ కార్యదర్శి గొంట్ల మోహనరావు, అన్నం రామకష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఏడాది విజయవాడకు నూతన మాస్టర్ ప్లాన్

**ప్రజాశక్తి-విజయవాడ :** విజయవాడకు వచ్చే ఏడాదిలో నూతన మాస్టర్ ప్లాన్ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారని అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్ సూచనల మేరకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్‌కు పట్టణ ప్రణాళిక శాఖ కార్యకలాపాలపై సమగ్ర వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్ తయారీ, జోనింగ్ నియమాలు, డిపిఎంఎస్ ద్వారా భవన అనుమతుల ఆన్‌లైన్ ప్రక్రియ, ఎల్‌ఆర్‌ఎస్, బిపిఎస్ పథకాల అమలు విధానాల,అధికారులు డిస్‌ప్లే డివైసెస్ పాలసీ అమలు, ఆక్రమణల తొలగింపు, మాస్టర్ ప్లాన్ రోడ్ల హక్కు-మార్గం (రైట్ ఆఫ్ వే) పరిరక్షణ, అనధికార నిర్మాణాలపై తీసుకుంటున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను వివరించారు. ప్రస్తుతం విజయవాడకు 2006లో సిద్ధం చేసిన మాస్టర్



ప్లాన్ ఉందని, ప్రతి 20 సంవత్సరాలకు మాస్టర్ ప్లాన్ మారుతుందని, అందులో భాగంగా 2026 లో విజయవాడ నగరపాలక సంస్థ కు నూతనంగా మాస్టర్ ప్లాన్ ప్రణాళికను సిద్ధం చేయబోతున్నారని తెలిపారు. అదనంగా, జంక్షన్ డెవలప్‌మెంట్లు, మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ ఇంటిగ్రేషన్, కాంటోన్మెంట్ ప్రాంతాల ప్రత్యేక పట్టణ ప్రణాళిక అంశాలపై కూడా వివరణ ఇచ్చి, అమరావతి జోనింగ్ రెగ్యులేషన్ బుక్కును బహుకరించారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్. ఒ డాక్టర్ రజియా షబీనా, టీ.పి. ఒ మతిన్, పాల్గొన్నారు.

## కృష్ణా యూనివర్సిటీ వాలీబాల్ పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాల వాలీబాల్ పురుషుల పోటీలు విజయవాడ శాతవాహన కళాశాల ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా కష్ణాజిల్లా వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ, నేషనల్ ప్లేయర్ డి.దయాకర్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు చైర్మన్‌గాఉన్న శాతవాహన కళాశాల ప్రిన్సిపల్ ఎం.బ్రహ్మయ్య అధ్యక్షత వహించగా ఆర్గనైజ్ సెక్రటరీగా డాక్టర్ బిసిహెచ్ సంగీతరావు వ్యవహరిస్తున్నారు. ఈ పోటీలకు కృష్ణా యూనివర్సిటీ సెలక్షన్ కమిటీ సభ్యులుగా మేజర్ స్వామి, మైలవరం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ ఆర్ రఘు,సెలక్షన్ కమిటీ సభ్యులు వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్ పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం : ఎంపిపి

**ప్రజాశక్తి-కంచికచర్ల :** రైతులు పండించిన పంటలను మార్కెట్లో కొనేనాథుడు లేక అల్లాడుతున్నామని కంచికచర్ల మండల పరిషత్ అధ్యక్షులు షేక్ మలక్ బషీర్ ఆవేదన వ్యక్తం చేశారు. కంచికచర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ షేక్ మలక్ బషీర్ అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సభ మందిరంలో జరిగింది. గత రెండు సీజన్లుగా రైతులు పండించిన మొక్కజొన్న, పత్తి, పెసలు, సెనగ, మినుము తదితర పంటలు కొనేనాథుడు కరువయ్యాడని, దీంతో రైతులు తాము పండించిన పంటలు ఎక్కడ నిల్వ చేసుకోవాలో అర్థం కాని అయోమయ పరిస్థితిలో ఉన్నారన్నారు. గిట్టుబాటు ధరలకు సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్నామని అధికారిక ప్రకటనలు వెలువడుతున్నాయే తప్ప మార్కెట్లో వివిధ కారణాలతో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయన్నారు. వరుస తుఫానులతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలైమందని విమర్శించారు. గహ నిర్మాణాల లబ్ధిదారుల ఎంపిక విషయంలో పారదర్శకత లోపించిందని తెలిపారు. మండలంలో భారీ వర్షాలకు పత్తి పంట నష్టపోతే... పత్తికి నష్టం వాటిల్లలేదంటూ అధికారులు నివేదికలు




సమర్పించడంతో రైతులకు నష్ట పరిహారం అందలేదని గనిఆత్కూరు ఎంపీటీసీ వెంపరాల వెంకటేశ్వర ఆరోపించారు. మండలంలో పంచాయితీ రాజ్, ఆర్ అండ్ బి రోడ్లకు గుంతలు పడినా పట్టించుకోనే నాథుడే కరువయ్యారని మండల పరిషత్ ఉపాధ్యక్షులు బండి మల్లికార్జునరావు ఆరోపించారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ రవికుమార్ వివరణ ఇస్తూ రూ.12 కోట్లతో రహదారులకు ప్రతిపాదన పంపామన్నారు. ఈ సమావేవంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరసింహారావు, ఎంపీడీవో డి వెంకటేశ్వరావు, వైస్ ఎంపీపీ మాధవి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.




## బార్ ఎన్నికల్లో గెలిపించండి

- సీనియర్ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ బలపరిచిన అభ్యర్థిగా బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీనియర్ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ గురువారం జగ్గయ్యపేట కోర్టులో జగ్గయ్యపేట న్యాయవాదులను కలిశారు. రాబోయే బార్ కౌన్సిల్ ఎన్నికలలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ బలపరిచిన అభ్యర్థిగా.. బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. విలువలతో కూడిన అభ్యర్థిగా, న్యాయవాదుల సమస్యల గురించి మాట్లాడటం కోసం మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నేపాక సుందర్ రావు, న్యాయవాదులు కాసరగడ్డ నాగేశ్వరరావు, రాయపూడి శ్రీనివాసరావు, వి.కృష్ణయ్య, సంతోష్, కారణం నరసింహారావు, టిఎల్ నరసింహారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఎఐని మరింత చేరువ చేస్తోన్న అమెజాన్

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** డిజిటల్ సమ్మిళితను పెంచడానికి ఎఐ మిషన్‌కు మద్దతు ఇస్తూ.. 2030 నాటికి లక్షలాది మంది భారతీయులకు కృత్రిమ మేధస్సు (ఏఐ)ని అందించేందుకు ప్రణాళికలను రూపొందించినట్లు అమెజాన్ కంట్రీ మేనేజర్ సమీర్ కుమార్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఎఐ మౌలిక సదుపాయాలలో 12.7 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడానికి కంపెనీ ప్రణాళిక చేసిందని తెలిపారు. అంతేకాకుండా దాని విభిన్న వ్యాపారాల ద్వారా 15 మిలియన్లకు పైగా చిన్న వ్యాపారాలకు ఎఐ ప్రయోజ నాలను తీసుకువస్తుందన్నారు. 2030 నాటికి నాలుగు మిలియన్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ అక్షరాస్యత, కెరీర్ అవగాహనను తీసుకురావడానికి అమెజాన్ కట్టుబడి ఉంది అని అన్నారు.

## సిఐటియు మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాశక్తి-మైలవరం :** ఈ నెల 31 నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖలో జరుగుతున్న సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సుధాకర్ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిత్యం పోరాటాలు చేస్తుందన్నారు. కార్మిక వర్గం అనేక త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తుందని, దాని స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావాలని ప్రయత్నం చేస్తుందన్నారు. లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు మధు శ్రీనివాసరావు, కార్యదర్శి సురేష్, అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ శారద, ఆర్ ఆర్ వి.పుష్పకుమారి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఎర్రంశెట్టి వీరమ్మ, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుపతిరావు, చంటి, ఆంజనేయులు, కార్మికులు పాల్గొన్నారు.

## కామినేనిలో అత్యధిక కార్డియాలజీ చికిత్సలు

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ :** కామినేని హాస్పిటల్స్ విజయ ప్రస్థానంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. గత పది సంవత్సరాలుగా గుండె చికిత్సల్లో అత్యుత్తమ సేవలను అందిస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని నెలకొల్పిన కామినేని కార్డియాలజీ విభాగం.. అత్యధిక సక్సెస్ రేటుతో 15 వేలకు పైగా కార్డియాలజీ, కార్డియోథోరాసిక్ ప్రొసీజర్లను పూర్తి చేసింది. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని నగరంలోని ఇంద్రప్రస్థ హెూటల్లో గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎంఎస్ఎన్ పవన్ కుమార్ మాట్లాడుతూ.. కామినేని హాస్పిటల్స్‌లో గుండె సమస్యల చికిత్సల్లో అరుదైన ఘనతను సాధించామని అన్నారు. గడచిన దశాబ్ద కాలంలో అత్యధిక సక్సెస్ రేటుతో 15 వేల ప్రొసీజర్లను పూర్తి చేయడం ప్రత్యేకంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ.. కామినేని హాస్పిటల్స్‌లో అత్యాధునిక ప్రమాణాలతో రూపొందించిన క్యాత్ ల్యాబ్, ల్యామినర్ ఫ్లో ఆపరేషన్




థియేటర్లు, కార్డియాక్ ఐసీయూలు ఉన్నాయని, ఇవన్నీ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించబడినట్లు తెలిపారు. మరో కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ భరత్ మాట్లాడుతూ.. ఓపెన్ హార్ట్ సర్జరీలు, వాల్వ్ రీప్లేస్‌మెంట్, బైపాస్ సర్జరీలు, బాల్య హదయ సమస్యల శస్త్రచికిత్సలను కూడా అత్యంత విజయవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ విజయంలో భాగస్వాములైన కార్డియాక్ విభాగం వైద్య బృందం, సిబ్బందిని కామినేని హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌ఆర్‌ఎస్ వర్ధన్ అభినందించారు. ఈ సమావేశంలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ అర్చన, క్లస్టర్ హెడ్ పి. సునీల్ కుమార్, మార్కెటింగ్ హెడ్ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు పాల బోనస్ అందజేత



**ప్రజాశక్తి-ఉంగుటూరు (బాపులపాడు)** : కృష్ణా మిల్క్ యూనియన్ క్లస్టర్ పరిధిలోని కార్యాల యంలో 2025 – 2026 ఆర్థిక సంవత్సరానికి రెండవ విడత నాలుగు నెలల బోనస్ నిమిత్తం రూ 1,58,56,854లు బోనస్ చెక్కులను చైర్మన్ చలసాని ఆంజనేయులు గురువారం అందజేశారు. హనుమాన్ జంక్షన్ క్లస్టర్ పరిధిలో అత్యధిక పాల సేకరణలో మొదటి స్థానంలో పల్లెర్ల మూడి, రెండవ స్థానంలో పడమర దిగవల్లి, మూడవ స్థానంలో రమణక్కపేట, నాలుగవ స్థానంలో గోగులంపాడు , ఐదవ స్థానంలో సీతారామ పురం సంఘాలు నిలిచాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆంజనేయులు మాట్లాడుతూ లాభసాటి పశు పోషణకు పప్పు జాతి గడ్డి అయిన హెడ్జ్ లూసర్న్ జ్యూరీ, సూపర్ నేపియర్ వంటి పశుగ్రాసాలు, చాప్ కట్టర్ వాడకం ద్వారా వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘ అధ్యక్షులు, వేతన కార్యదర్శిలు, మేనేజర్, సూపర్ వైజర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.




సెంటర్‌ను పరిశీలిస్తున్న బూసి వినీత

## సఖీ వన్‌స్టాప్ సెంటర్ పరిశీలన

**ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా)** : జిల్లా మహిళ , శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న సఖీ వన్‌స్టాప్ సెంటర్‌ను ఏపీ, మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత గురువారం సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీంచారు. అనంతరం రిజిస్టర్స్ తనిఖీ చేసి సిబ్బంది నుండి పలు వివరాలను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌సి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం పరిశీలిస్తున్న పంచకర్ల రంగారావు

## ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

**ప్రజాశక్తి-తోట్లవల్లూరు** : ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఏపీ కౌలు రైతుల సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు అన్నారు. గురువారం మండలంలోని దేవరపల్లి ప్రాంతాల్లో పర్యటించి ధాన్యం రైతుల పరిస్థితులను తెలుసు కున్నారు. ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా గోనె సంచులను ఇచ్చి మద్దతు ధరకు ధాన్యాన్ని కొని రైతును ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తేమ శాతం పేరుతో దళారులు మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారని దీని అడ్డుకోవడానికి ప్రభుత్వం తేమశాతంతో పని లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

## మత్స్యకారులకు లైసెన్స్ సర్టిఫికెట్లు అందజేత

**ప్రజాశక్తి-పెడన** : పెడన నియోజకవర్గం బంటుమిల్లి మత్స్య సహాయ సంచాలకుల వారి కార్యాలయంలో మత్స్యకారులకు నూతనంగా 78 బోర్ట్స్ లైసెన్స్ సర్టిఫికెట్స్‌ను పెడన శాసనసభ్యులు కాగిత కష్ణ ప్రసాద్ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మత్స్యకారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## సిమెంట్ బెంచీలు వితరణ



**ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం)** : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గన్నవరం మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాలలో మొత్తం 23 సిమెంట్ బెంచీలు (ఒక్కొక్కటి రూ. 6,500 విలువ చొప్పున) గురువారం ఏర్పాటు చేశారు. జడ్పీహెచ్‌ఎస్ బాయ్స్ గ్రౌండ్ వద్ద 11, పోలీస్ స్టేషన్లో రెండు, సబ్ కోర్టుల వద్ద ఒకటి, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద ఒకటి, గాయత్రి దేవాలయ ప్రాంగణం వద్ద ఒకటి, స్పందన వికలాంగుల పాఠశాల వద్ద రెండు, రైతు బజార్ ప్రదేశంలో ఒకటి, అగ్నిమాపక కేంద్రం వద్ద ఒకటి, రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయం వద్ద ఒకటి, , కోర్టు ప్రాంగణంలో ఒకటి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మడుపల్లి బాలకృష్ణమూర్తి, కర్రా వరప్రసాద్, వీసం ప్రసాదరావు, పువ్వల ఆదినారాయణ, కనకాల వెంకటేశ్వరరావు, ముక్కామల సుబ్బారావు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కెవిఆర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో యాజమాన్యం

## అంతర్ కళాశాలల పోటీల్లో ఎస్ఆర్‌జిఈసి విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల చెందిన పురుషుల, మహిళల టీములు జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ, కాకినాడ వారు వెలగపూడి సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్‌లో కళాశాల చెందిన మహిళల టీము ద్వితీయ స్థానం పురుషుల టీము తతీయ స్థానం సాధించారనికళాశాల ప్రిన్సిపాల్ డా.బుర్రా కరుణ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ వారు నిర్వహించిన యూనివర్సిటీ టీములో పి.హర్షిత లక్ష్మి మూడవ సంవత్సరపు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విద్యార్థిని ఎన్నికై ఈ నెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు గీతం యూనివర్సిటీ, విశాఖపట్నంలో నిర్వహించు దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీలలో పాల్గొంటార న్నారు. డి. గంగాధర్ 4వ సంవత్సరపు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థి ఈ నెల 25వ తేదీ నుండి 28వ తేదీ వరకు అమిత్ యూనివర్సిటీ చెన్నై లో జరుగు దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ బహుమతులు పొందిన విద్యార్థినీ విద్యార్థులను వ్యాయామ అధ్యాపకులు మత్తి శివ శంకర్, డి.పూజిత, ఎస్.నాగ బాబు లను కళాశాల ఛైర్మన్ డా.నాగేశ్వరరావు వల్లూరు పల్లి, సెక్రటరీ, కరస్పాండెంట్ సత్యనారాయణరావు వల్లూరుపల్లి, కో సెక్రటరీ కరస్పాండెంట్ వల్లూరు పల్లి రామకష్ణ, డైరెక్టర్ డా.పి.సిద్ధయ్య, యాజమాన్య సలహాదారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది వీరిని అభినదించారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా మహాసభలో వక్తలు

**ప్రజాశక్తి-ఉయ్యూరు** : నేటి విద్యారంగం పూర్తిగా ప్రైవేటు కార్పొరేట్ సంస్థల ఆధీనంలోనికి వెళ్లాయని నేటి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడంలో విఫలం చెందాయని విద్యావేత్త, రిటైర్డ్ ఎంఈఓ కె విశ్వమోహన్ అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ కష్ణాజిల్లా 51 వ మహాసభ ఉయ్యూరులో నాగళ్ళ రాజేశ్వరమ్మ జానకి రామయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు కార్పోరేట్ విద్యాసంస్థల ప్రభావంతో అనేక ప్రభుత్వ పాఠశాలలో నిర్వీర్యమైపో యాయని, నేటి ప్రభుత్వం విద్యా వ్యవస్థ పై దష్టి సారించాలని అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. విద్యా వైద్య రంగాలలో అనేక మౌలికమైన వసతులను కల్పించడమే కాక పేద మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండే ప్రభుత్వ పాఠశాలలను విద్యా సాంకేతిక పరంగా బలోపేతం చేయాలని ఆయన అన్నారు. ఈ మహాసభలో ముఖ్యంగా నాలుగు తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా తీర్మానించారు. విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని, అలాగే 17 మెడికల్ కాలేజిల్లను ప్రైవేట్ పరం చేయాలన్న ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వమే ప్రభుత్వ మెడికల్ కాలేజీలు నిర్వహించాలన్నారు. అలాగే కష్ణ యూనివర్సిటీ హాస్టల్ పూర్తి చేసి నిధులు కేటాయించి అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, జిల్లావ్యాప్తంగా నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలను మండలాల స్థాయిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ 17 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ కష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా బి.పూజిత, ఎస్.సమరం, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులుగా సలీం, నాగేంద్ర, హారిక, సహాయ కార్యదర్శులుగా ఈ.ప్రేమ్ కుమార్, బసిమ్, అమీర్, జిల్లా కమిటీ సభ్యులు జగన్, సాయి, సంధ్య, నక్షిత, వంశీకృష్ణ, ఎండీ హుజైఫ్తలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.







స్పోర్ట్స్ మీట్ ప్రారంభిస్తున్న దృశ్యం

## స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)** : పిల్లల్లో మానసిక వికాసంతో పాటు శారీరక వికాసం కూడా ఎదుగుదలకు ఎంతో అవసరమని జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్. కుముదిని సింగ్ తెలిపారు. మచిలీపట్నం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం నిర్వహించిన సిడబ్ల్యుఎస్ఎన్ స్పోర్ట్స్ మీట్ (పారా ఒలింపిక్స్)ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. పోటీలలో విజేతలైన పిల్లలకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలు ఏ విషయానికీ తీసిపోరని, వివిధ క్రీడల్లో ప్రదర్శించిన ప్రతిభ మరోసారి రుజువైందన్నారు రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో వంటి విభాగాల్లో పిల్లలు మెరుగైన ప్రతిభ కనబర్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అద నపు ఎస్పీ సత్యనారాయణ, పేరా ఒలింపిక్ అసోసియేషన్ పరిశీ లకులు శ్రీనివాసరెడ్డి, జిల్లా క్రీడల అభివద్ధి అధికారి ఝాన్సీ, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త కె.ఏడుకొండలు పాల్గొన్నారు.

## మూడో రోజుకు బ్రహ్మోత్సవాలు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : డోకిపర్రు మహాక్షేత్రంలో దశమ బ్రహ్మో త్సవాలు గురువారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. మూడో రోజున ఉదయాన్నే సుప్రభాత, తోమాల సేవ, అర్చన కైంకర్యాల అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీదేవి, భూదేవి సహితంగా గజ వాహనంలో విహరించి గ్రామస్తులు, భక్తుల నుంచి పూజలు అందుకున్నారు. శ్రీ వేంకటేశ్వరుని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తరించారు. తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం దేవదేవుడు డోకిపర్రు గ్రామంలో రథంలో ఊరేగారు. రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం గరుడోత్సవం జరిగింది. మూడోరోజు ఆలయ వ్యవస్థాపక ధర్మక ర్తలు పీవీ కృష్ణారెడ్డి, సుధారెడ్డి పర్యవేక్షణలో జరిగిన పూజాదికాల్లో నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ, పీ నాగిరెడ్డి, ప్రసన్న, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వరునికి వెండి మండపం అందజేత



వెండిమండపం

**ప్రజాశక్తి-మోపిదేవి** : మోపిదేవి గ్రామంలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి ఆర్‌విఆర్ గ్రూప్ అధినేత, ఆర్‌విఆర్ డిజిటల్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ లిమిటెడ్ ఛైర్మన్ రావి వీరరాఘవచౌదరి, సౌభాగ్యలక్ష్మి దంపతులు వెండి మండపాన్ని గురువారం అందజేశారు. కోటి ఒక లక్ష యాభై మూడు వేల ఏడు వందల నలభై రెండు రూపాయల విలువ చేసే 48 కేజీల 895 గ్రాములు బరువుగల మండపాన్ని అందజేశారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి చేతుల మీదుగా మండపాన్నిఆలయ డిప్యూటీ కమిషనర్ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామవరప్రసా దరావుకు అందజేశారు. అర్చకులు వెండి మండపాన్ని శ్రీ స్వామి వారికి అలంకరించి, దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## డిడిఓలతో గ్రామాలు అభివృద్ధి

### • కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

**ప్రజాశక్తి- నందిగామ :** వ్యవస్థలు ఎంత బలంగా ఉంటే అభివృద్ధి అంత బాగా పరుగులు తీస్తుందని.. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి (డీడీవో) కార్యాలయాల ద్వారా మరింత ప్రగతికి వీలుంటుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 77 డీడీవో కార్యాలయాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్తూరు నుంచి గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా నందిగామ మండలం ఐతవరంలో గురువారం జరిగిన డీడీవో కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావుతో పాటు కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నందిగామ డివిజన్ డీడీవో జి.జ్యోతికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాలు ప్రారంభం కావడం శుభ పరిణామమని, కీలక ప్రగతి సూచికల్లో అభివృద్ధికి,



తలసరి ఆదాయం పెరుగుదలకు అన్ని శాఖల అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధికి సంబంధించి అన్ని అంశాల్లోనూ పురోగతికి ప్రజాప్రతినిధులతో కలిసి కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయాల ప్రారంభంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి క్షేమం, సంక్షేమానికి కృషి చేయాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, డీపీవో పి.లావణ్య కుమారి, పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని సిఆర్‌ఎంటిల వినతి

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట**

సిఆర్‌ఎంటిల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జగ్గయ్యపేట తహశీల్దార్ కార్యాలయంలో కార్యాలయపు అధికారికి సిఆర్‌ఎం టీచర్స్ యునేటెడ్ ఫోరం కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్సులను ఎ, బి క్లస్టర్ ప్రతిపాదిత విధానాన్ని విరమించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా సిఆర్‌యంటిల అర్హత ఆధారంగా వేతనాలను పెంచాలని, యంటియస్ అమలు చేయాలని, డి.యస్.సి.లో వెయిటేజి ఇవ్వాలని, ట్రావెలింగ్ అలవెన్సు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్.యం టిచర్స్ యునేటెడ్ ఫోరం కమిటీ సభ్యులు యల్ రాంప్రసాద్, ఐ రమేష్ నాయక్, యం వెంకటేశ్వర్లు, కె రమాదేవి, జి దుర్గా తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులను ఆదుకోవాలని నిరసన

**ప్రజాశక్తి- నందిగామ :** కూటమి పాలనలో రైతులు కుదేలౌతున్నారని, రైతుల ఆర్తనాదాలు ప్రభుత్వానికి పట్టడం లేదని వైసిపి నందిగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు విమర్శించారు. పత్తి రైతులు



ఆదుకోవాలని, పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ ఆధ్వర్యంలో గురువారం నందిగామ మార్కెట్ యార్డ్ వద్ద రైతులు నిరసన తెలిపారు. తొలుత వైసీపీ కార్యాలయం నుండి నందిగామ ఎఎంసి కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. అక్కడ అధికారులకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మొండితోక జగన్ మోహన్ రావు మాట్లాడుతూ నందిగామ - కంచికచర్ల మార్కెట్ యార్డ్‌లలో ఆర్భాటంగా సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని, తీరా రైతుల నుండి పత్తి కొనుగోలు చేయకుండా వంద రకాల ఆంక్షలు పెట్టి అన్నదాతలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళారులతో కుమ్మక్కై రైతును గుల్ల చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రైతుల ఇబ్బందులను తొలగించాలని రైతుల నుండి పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్లు ముక్కపాటి నరసింహరావు, వెలగపూడి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు మస్తాన్, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా వికలాంగుల దినోత్సవం

**ప్రజాశక్తి-కంచికచర్ల :** కంచికచర్ల మండల ప్రజా పరిషత్ ఆవరణలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల గ్రంథాలయ అధికారి అమరేశ్వరి పాల్గొని మాట్లాడుతూ వికలాంగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న అవసరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగవైకల్యం అనేది శరీరానికి మాత్రమేనని, మనసుకు, మేదస్సుకు కాదన్నారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల ఎంఈఓ 2 బాలాజీ, ఎలిమెంట్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, క్రాఫ్ట్ టీచర్ కనకారావు, పాల్గొన్నారు

## ఆత్మగౌరవ దీక్షను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి-మైలవరం :** సిఆర్‌ఎం టీచర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన ఆత్మగౌరవ దీక్షను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బుద్ధారపు గోపాలరావు డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గురువారం తహశీల్దార్ అబ్దుల్ దర్యా, ఎంఈఓ బాలుకు అందజేశారు. అనంతరం గోపాలరావు మాట్లాడుతూ సమగ్ర శిక్ష పిఎబిలో ఆమోదించిన జీవో నంబర్ 65 ప్రకారం 4034 స్కూల్ కాంప్లెక్స్‌లలో రాష్ట్ర ప్రభుత్వం సూచించిన సిఆర్‌ఎంటి పోస్టులను ఏ క్లస్టర్, బి క్లస్టర్ ప్రతిపాదిత విధానాన్ని విరమించాలన్నారు. కొన్ని జిల్లాల్లో ఖాళీగా ఉన్న సిఆర్‌ఎంటి పోస్టులలో దూరాన ఉన్న వారిని మ్యాపింగ్ చేసే ప్రక్రియను విరమించి ఖాళీగా ఉన్న పోస్టులకు నూతన నియామకాలు చేసి సిఆర్‌ఎంటిలపై అదనపు పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌ఎంటి నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** జగ్గయ్యపేట మున్సిపాలిటీలో రూ.100 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం



రాజగోపాల్ (తాతయ్య) ప్రకటించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఈ నిధులను జిల్లా మైనింగ్ ఫండ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్, కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకమైన అమృత్ 2.0 (అమృత 2.0), స్వచ్ఛ ఆంధ్ర సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, అలాగే 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నుండి కేటాయించడం జరిగిందని తెలిపారు. మున్సిపాలిటీలోని ప్రతి రంగాన్ని అభివద్ధి చేసే సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసినట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలక వర్గం కౌన్సిలర్లు, కమిషనర్ తులసి వెంకటకష్ణారావు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరి ప్రదక్షిణ ప్రారంభం

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోదాడ, ఖమ్మం, సూర్యాపేట, మిర్యాలగూడ నుండి యాత్రికులు, కోదాడ సీతారామాంజనేయ కోలాట బృందం, గ్రామస్తులు, జగ్గయ్యపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ పి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. శ్రీ స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగిందని ఆలయ ధర్మకర్తల మండల చైర్మన్ కే రవీంద్ర భరద్వాజ్, ఆలయ సహాయ కమిషనర్ కె సాంబశివరావు తెలిపారు.

## మున్సిపల్ కార్మికులను ఆదుకోవాని వినతి

**ప్రజాశక్తి-నందిగామ :** నందిగామ మున్సిపాలిటీలో రిటైర్ అయిన, మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం నందిగామ మున్సిపల్ కమిషనర్ లోవరాజుకు సిఐటియు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.గోపాల్ మాట్లాడుతూ నందిగామ మున్సిపాలిటీలో పలు విభాగాలలో అనేక సంవత్సరాలుగా పారిశుధ్యం ఇంజనీరింగ్ విభాగంలో కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. గత నెలలో ఐదుగురు కార్మికులు రిటైర్ అయ్యారని, మరో ఐదుగురు కార్మికులు మరణించారని తెలిపారు. దీంతో వారి కుటుంబాలు ఆర్థిక ఆసరా కోల్పోయి ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రిటైర్ అయిన, మరణించిన కార్మికుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి



ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు దాసవరపు సైదా, మాణిక్యం, రాజారావు, ప్రసాద్, నాగరాజు, బూసి, రుతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## డప్పు కళాకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి-వత్సవాయి :** రాష్ట్ర ప్రభుత్వం డప్పు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని, అందులో బాగంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి క్రాంతి కుమార్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మల్లవరపు




కుటుంబరావు డిమాండ్ చేశారు. స్థానిక బొగ్గవరపు వెంకటేశ్వరరావు విజ్ఞాన కేంద్రంలో మండల డప్పు కళాకారుల రెండవ మహాసభ గురువారం జరిగింది. ఈ సభలో పలు డిమాండ్లను ఆమోదించారు. ప్రతి కళాకారుడికి రెండు ఎకరాల భూమి కేటాయించాలని, పింఛన్ సౌకర్యానికి ఆన్లైన్ ద్వారా అర్జీలు వెంటనే స్వీకరించాలని, బస్సు ప్రయాణానికి 40 శాతం రాయితీ కల్పించాలని, ఉచిత ప్రమాద, ఆరోగ్య బీమా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా మేడి బెంజిమెన్, కార్యదర్శిగా పాము ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా వై ప్రభుదాస్, దారెల్లి వెంకటేశ్వరరావు, ట్రెజరర్‌గా కనకపుడి నాగభూషణం, సహాయ కార్యదర్శిగా వేల్పుల వెంకటరత్నం, కార్యవర్గ సభ్యులుగా మోదుగ శివయ్య కత్తి ఇస్సాకు, శెట్టి వెంకటేశ్వర్లు, మేకల వెంకటేశ్వర్లు, నంద్రు బాబు, పులి చిన్న దేవయ్యతో పాటు 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి రాము, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోటా కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలి

**ప్రజాశక్తి - తిరువూరు :** తిరువూరు మండల ప్రజా పరిషత్ పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ గద్దల భారతి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎంపీటీసీలు, సర్పంచులు.. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ సర్పంచ్‌లకు తెలియకుండా జాతీయ గ్రామీణ ఉపాధి పనులు చేసేందుకు తీర్మానం ఎలా చేస్తారని జడ్పీటీసీ వై.రామచంద్రారెడ్డి అధికారులను ప్రశ్నించారు. మండలంలోని పలు గ్రామాల్లో స్మశాన వాటికలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న శ్మశానవాటికలు ఆక్రమణకు గురయ్యాయని, ఎస్సీ, ఎస్టీలు, బీసీలు అంత్యక్రియలు కాలువగట్లు, చెరువుల్లో నిర్వహించుకోవలసిన దుస్థితి నెలకొందని సర్పంచులు పేర్కొన్నారు. శ్మశానవాటికలు అవసరమున్న గ్రామాలను గుర్తించి తనకు తెలియజేయాలని, అవకాశమున్నంతవరకు స్థలాలు కేటాయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో ఇన్ ఛార్జ్ తహశీల్దార్ నాగమణి, ఎంపీడీవో రవిబాబు, మండల వ్యవసాయ అధికారిణి పద్మ తదిత రులు పాల్గొన్నారు.

## డివిజనల్ అభివృద్ధి కార్యాలయం ప్రారంభం

**ప్రజాశక్తి - తిరువూరు :** తిరువూరు డివిజనల్ డెవలప్‌మెంట్ (అభివృద్ధి) కార్యాలయాన్ని రూరల్ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం



కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తిరువూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ నిర్మూలన, స్వయం ఉపాధి పథకాల ప్రోత్సాహం, చిన్న తరహా పరిశ్రమల అభివద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీడిఓ ఎ.వెంకటరమణ, ఎంపీపీ గద్దల భారతి సర్పంచ్ జి. శ్రీనివాసరావు, ఐదు మండలాల ఎంపిడిఓ లు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాలీబాల్ క్రీడాకారులకు శిక్షణ

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం:** ఉమ్మడి కృష్ణాజిల్లా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన అండర్ 14 వాలీబాల్ విభాగంలో ఎంపికైన జిల్లా స్థాయి క్రీడాకారులకు కొండపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శిక్షణ శిబిరం



నిర్వహించారు. ఈ శిక్షణా శిబిరాన్ని స్థానిక కూటమి నాయకులు, ప్రధానోపాధ్యాయురాలు హేమలత సందర్శించి విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో వాలీబాల్ పోటీకి సన్నదమవుతున్న క్రీడాకారులు విజయం సాధించి కొండపల్లికి, మైలవరం నియోజకవర్గం మంచి పేరు తీసుకోవాలని ఆకాక్షించారు. క్రీడాకారులకు కొండపల్లి పీడీ లైన గ్యాస్ రత్నం, ఎస్కే రుద్వాన తర్ఫీదు ఇస్తున్నారు.



## కొండలమ్మను దర్శించుకున్న జడ్జి

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని కష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, మచిలీపట్నం సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య గురువారం దర్శించుకున్నారు. వారిని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు దుశ్శాలువాతో సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత వారి పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలను ఒనరించారు.

**కొండలమ్మలకు పంచామతాభిషేకం** : కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో గురువారం మార్గశిర మాసం పౌర్ణమి సందర్భంగా ప్రాతఃకాలమున శ్రీ అమ్మవార్లకు పంచామతాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో రుద్ర సహిత చండీ హవనం నిర్వహించారు. దేవస్థాన ముఖ్య అర్చక స్వామి రుద్రపాక శివ సంతోష్ శర్మ, కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణ, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్, ధర్మకర్తల సభ్యులు కళ్ళే పల్లి సుగుణ శేఖర్, వడ్లమూడి రవీంద్ర బాబు పాల్గొనారు.



## రైతు సేవా కేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డలో రెవిన్యూ సమావేశ మందిరం ఎదురుగా నిర్మించిన నూతన రైతు సేవ కేంద్రాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రారంభిం చారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ 23.94 లక్షలు, గ్రామపంచాయతీ నిధులు రూ 4 లక్షలు కలిపి ఈ భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా నూతన కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తేమ శాతం పరీక్షను, వ్యవసాయ విజ్ఞాన పుస్తక ప్రదర్శనను, రైతుల కోసం సిద్ధం చేసిన గోని సంచులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి. వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల. సుమతి దేవి కొత్తపేట పిఎసిఎస్ అధ్యక్షులు యలవర్తి నాగ మునేశ్వరరావు (చిన్న) తాసిల్దార్ కె. నాగ మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ. పిచ్చే శ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్‌లో సమస్యలపై అర్జీల వెల్లువ



కోడూరులో అర్జీలు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ బుద్ధప్రసాద్

**ప్రజాశక్తి-కోడూరు** : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం కోడూరులో ప్రజా దర్బార్ నిర్వహించారు. కోడూరు మండల పరిషత్ కార్యాల యంలో వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ వ్యక్తిగత, గ్రామ సమస్యలపై 57 అర్జీలు సమర్పించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు ఆయా అర్జీలు పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కారాలు సూచించారు.

**రైతు సమస్యలపై వినతి** : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కోడూరు మండల కమిటీ రైతుల సమస్యపై పలు వినతిపత్రాలు ఎంఎల్ఎకు అందజేశారు. రైతులకు నోటీసు ఇవ్వకుండా విచారించకుండా (22/ఎ) నిషేధిత ఆస్తులు జాబితాలో చేర్చిన దాదాపు 25000 ఎకరాలకు పైగా వున్నా రైతుల పట్టా భూములను సుమోటోగా విడుదల చేయించమని కోరారు. న్యూ ఇరాలి డ్రెయిన్ (పాలకాయతిప్ప వద్ద) అవుట్ ఫాల్స్ స్ల్యూయిస్ ను కోడూరు అవుట్ ఫాల్స్ లో ఇస్ను పట్టిష్టంగా నిర్మాణం చేయించాలని, గత 5 సంవత్సరాలుగా పంటకు నోచుకోని రైతులు రానున్న సార్వాకు అయినా పంట వేసుకునే విధంగా ఏర్పాటు చేయాలనిన్నారు. కోడూరు విశ్వనాథపల్లి రోడ్డుని పూర్తిస్థాయిలో పటిష్టంగా నిర్మించాలని, నారే పాలెం నుంచి ఏడవ నెంబర్ కాలువ కుడి గట్టును రోడ్డుగా నరసింహపురం వరకు నిర్మించాలని స్థానిక సిపిఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆవుల బసవయ్య, పోలాబత్తిన మోహన్ రావు, రేపల్లె యోగ ప్రకాష్, కొప్పనాతి తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

అలాగే కోడూరు మండల పరిధిలోని హంసలదీవి గ్రామంలో బుక్ కీపర్ గ్రామ సమైక్య సంఘంలోని 10 లక్షల 70 వేలు నిధులు దోచేసిందని డ్వాక్రా మహిళలు మండలి బుద్ధ ప్రసాద్‌కు వినతి అందించారు. ఈ విషయంపై దర్యాప్తు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

**ప్రజాశక్తి-పామర్రు** : స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పలు సమస్యలతో వచ్చిన ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడి సాధ్యమైన సమస్యలను అప్పటికప్పుడే అధికారులతో చర్చించి పరిష్కరించారు. స్థానిక కార్పెంటర్ కాలనీలో విద్యుత్తు లైను లేక అంధకారంలో ఉంటున్నారని సిఐటియు నాయకులు ఓ గంగాధర్ ఆధ్వర్యంలో ఓరుగంటి బాబురావు, అచ్చారావులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా రాబోవు 15 ఫైనాన్స్ నిధుల నుండి పనులు చేపట్టి మూడు వారాల్లో సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రజా దర్బార్లో మొత్తం 30 వినతులు వచ్చాయి. జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం, పంచాయతీ సభ్యుడు మంతెన రామాంజనేయులు పాల్గొన్నారు.




పామర్రులో అర్జీలు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా



వాటర్ ట్యాంక్ పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు

## వాటర్ ట్యాంక్ పరిశీలన

**ప్రజాశక్తి-అవనిగడ్డ** : పులిగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్నందున తక్షణమే వాటర్ ట్యాంకు సమస్య పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు గురువారం ఆర్డబ్ల్యూఎస్ ఏఈ బోగాది జగత్‌తో కలిసి వాటర్ ట్యాంక్ ను పరిశీలించారు. వాటర్ ట్యాంక్ పక్కనే అంగన్వాడి స్కూలు ఉన్నందున భయం భయంగా చిన్నారులు, అంగన్వాడి కార్యకర్తలు ఉంటున్నా రని ఏఈ దృష్టికి తీసుకువచ్చారు. ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంక్ వల్ల ఏదైనా జరిగితే అంగన్వాడి పిల్లలకు ప్రమాదం జరగడంతో పాటు గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి. హరిత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రభు ప్రభాకర్, బీహెచ్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు

**ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డ నియోజక వర్గం పరిధిలోని శ్రీకాకుళంలో ఏకరాతి ప్రసన్న మల్లికార్జున దేవాలయం అభివృద్ధికి 2.50 కోట్లు, నాగాయలంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి రూ కోటి రూపాయలు మంజూరైనట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. గురువారం బుద్ధప్రసాద్ తమ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నిధులు మంజూరు చేసిన రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



మాట్లాడుతున్న బండి రామకృష్ణ

## పవన్ కళ్యాణ్‌పై విమర్శలు తగదు : బండి

**ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్** : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించడం తగదని జనసేన పార్టీ మచిలీపట్నం ఇంచార్జ్ ఉమ్మడి కృష్ణాజిల్లా డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పేర్కొన్నారు. గురు వారం సాయంత్రం జనసేన పార్టీ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సినిమాలపై కామెంట్ చేస్తున్న పేర్ని నాని ఒకప్పుడు బందరులో మెగా హీరోల సినిమాలకు టికెట్లు అమ్ముకున్న రోజులను గుర్తు చేసుకోవాలన్నారు. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 76 డిడిఓ కార్యాలయాలు ప్రారంభించి పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామాల అభివద్ధికి పవన్ కళ్యాణ్ చేస్తున్న కషికి దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూస్తుందన్నారు. పెద్ద యాదర సర్పంచ్ గల్లా తిమోతి, మచిలీపట్నం టౌన్ అధ్యక్షులు గడ్డం రాజు అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్ ఒంపుగడల చౌదరి, గంపల కష్ణ చలమలశెట్టి రమేష్ , తదితరులు పాల్గొన్నారు.

## బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

**ప్రజాశక్తి-కంకిపాడు** : కేంద్రం, రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. కంకిపాడులోని సంఘ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ. ఎస్టీలో నిరుద్యోగ యువత నేటికి ఆర్థిక ఇబ్బందుల్లో జీవిస్తుండటంపై ప్రభుత్వాలు దష్టి పెట్టాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎన్నో సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ రాజ్యాంగ కర్తలు ఆశించిన మార్పు వారిలో రాకపోవడం ఎస్సీ ఎస్టీ వర్గాల పట్ల ప్రభుత్వాలకు ఎంత చిత్తశుద్ధి ఉందో సమాజం అవగతం చేసుకోవాలన్నారు. ఎస్సీల ఆర్థిక అభివద్ధికి అవసరమైన ఎస్సీ కార్పొరేషన్ నిధులను విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తత్సారం చేస్తుందని విమర్శించారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## దాతలకు సన్మానం

**ప్రజాశక్తి-ఘంటసాల** : ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం గ్రామంలో ఉన్న ప్రాచీన శ్రీ ఏకరాత్రి ప్రసన్న మల్లికార్జునస్వామి దేవాలయం పునర్నిర్మాణం కోసం విరాళం అందించిన దాతలను కుటమి నాయకులు ఘనంగా సత్కరించారు. ఆలయ పునర్నిర్మాణానికి రూ.3.70 కోట్లు అంచనా వ్యయంతో సమగ్ర ప్రణాళిక రూపొందించారు. ఈ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.50 కోట్లు మంజూరు చేయగా, మిగతా నిధులు దాతల సహకారంతో సమీకరించనున్నారు. ఆలయ అభివృద్ధి కోసం విరాళాలు అందించిన దాతలను గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు గురువారం ప్రత్యేకంగా సన్మానించారు. దాతలలో తమ్మన సోమేశ్వరరావు రూ.8,10,116, దాసం రామకష్ణ రూ.50,116, కొండవీటి కోటేశ్వరరావు (కోటి) రూ.50,116, కొంగితల అర్చేశ్వరారావు (బుల్లబయ్) రూ.50,116, సూరపనేని కిషోర్ రూ.50,000/- విరాళాలు అందించారు. వీరిని టీడీపీ నాయకులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), కూటమి నాయకులు మరియు గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శీలం శ్రీనివాస్, జనసేన నాయకులు కొండవీటి నాని, మాదాసు వినయ్, తమ్మన దినేష్, తమ్మన పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# డిడిఒ కార్యాలయాలు ప్రారంభం

**ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్** : పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి డివిజనల్ అభివద్ధి అధికారుల కార్యాలయాలు ఎంతగానో తోడ్పడతాయని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్తూరు జిల్లాలో నూతనంగా నిర్మించిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయంతో పాటు రాష్ట్రంలో నూతనంగా నిర్మించిన మొత్తం 77 డిడిఓ కార్యాలయా లయ భవనాలను లాంచనంగా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ మచిలీపట్నం మండలంలోని పోతేపల్లి గ్రామ సచివాలయ పైభాగంలో నూతనంగా నిర్మించిన డివిజనల్ అభివద్ధి అధికారి కార్యాలయాన్ని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, రాష్ట్ర ఎంజిఎన్ఆర్ఇజిఎస్ అదనపు కమిషనర్ శివప్రసాద్ లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆక్వా కల్చర్ అభివద్ధి సంస్థ డైరెక్టర్ లంకె నారాయణ ప్రసాద్, డిసి ఎం ఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, జిల్లా పరిషత్ సిఇఓ కె.కన్నమనాయుడు, డ్వామా పీడీ శివప్రసాద్, డి ఎల్ డి ఓ జి పద్మ, డి ఎల్ పి ఓ రజావుల్లా, ఎంపీడీవో వెంకటేష్ ,తహసిల్దారు నాగభూషణం, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు పాలొ న్నారు.

**ప్రజాశక్తి - గుడివాడ** : స్థానిక ఏరియా ఆసుప్రతి ఎదురుగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాల యంలో నూతనంగా ఏర్పాటు చేసిన గుడివాడ డివిజనల్ అభివద్ధి అధికారి కార్యాలయాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. డిడిఓ సునీతశర్మ, స్పెషల్ ఆఫీసర్ నరసింహులు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, డిఎల్‌పిఓ సంపత్‌కుమారి, ఎండిఓ బివై విష్ణుప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాత్రగడ్డ రవికు మార్ పాల్గొన్నారు.




బందరులో డిడిఒ కార్యాలయం ప్రారంభిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-ఉయ్యూరు** : సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వానికి మంచి పేరుతీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గండిగుంట సచివాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటుచేసిన డివిజినల్ డెవలప్మెంట్ కార్యాలయం గురువారం ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. డీపీఓ జె. అరుణ, డీఎల్డీఓ రాజేశ్, ఎంపీడీఓ లు శేషగిరి రావు, సీతారామారాజు, రవికాంత్, జ్యోతి, తహసీల్దార్ సురేశ్ కుమార్, ఏఎం సీ చైర్మన్ ప్రవీణ్ కుమార్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టిలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

● కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ




ప్రజాశక్తి-విజయవాడ : ఎస్‌సి, ఎస్‌టిలపై వేధింపులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని..చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం జరిగిన జిల్లాస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ (డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ) సమావేశం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి డివిఎంసి సమావేశం జరుగుతుందని చెప్పారు. పాత కమిటీ గడువు ముగిసినందున కొత్త సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. డివిఎంసిలో శాసనసభ్యులతో పాటు, పోలీసు శాఖ నుంచి ఒకరు, ముగ్గురు అధికార సభ్యులు, ఐదుగురు అనధికార సభ్యులు, ఎన్జీవోల నుంచి ఒకరు ఉంటారని, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని చెప్పారు. వేధింపుల కేసుల విచారణను త్వరితగతిన పూర్తిచేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. గ్రామాలలో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ చట్టం అమలుకు జిల్లా యంత్రాంగంతో కలిసి సమన్వయంతో పనిచేయాలని అనధికార సభ్యులకు సూచించారు. బాధితులకు భరోసా అందించడంతోపాటు ఎఫ్‌ఐఆర్ నమోదయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో 32 కేసులలో బాధితులకు ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. డీసీపీ సరిత మాట్లాడుతూ.. జిల్లాలో 49 కేసులు విచారణ దశ (అండర్ ఇన్వెస్టిగేషన్)లో ఉన్నాయన్నారు. పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు ప్రతిరోజు కేసుల పురోగతిని సమీక్షిస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ జనాభా అధికంగా గల గ్రామాలను ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం కింద అభివృద్ధి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు. మూడు దశలలో 82 గ్రామాలను పీఎం ఏజేవై పథకం కింద గుర్తించినట్లు చెప్పారు. ఆ గ్రామాలలో ఘన వ్యర్థాల నిర్వహణ, సౌర విద్యుత్ ఏర్పాటు, నైపుణ్య అభివృద్ధి వంటివి చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ ఎం.లక్ష్మీ నరసింహం, ఆర్డిఓ కె. చైతన్య, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రమాదేవి, ఏసీపీలు పావన్ కుమార్, దుర్గారావు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, పాల్గొన్నారు.

## నేటి నుండి రామకృష్ణయ్య పంతులు జయంత్యోత్సవాలు

విజయవాడ : 'గాయక సార్వభౌమ' సంగీత పరిషత్తు, 'స్వరఝరి' సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5 నుండి నుండి 9వ తేదీ వరకు స్థానిక గాంధీనగర్ వి.హెచ్.గ్రంథాలయంలో 'గాయక సార్వభౌమ', 'భారతీ తీర్థోపాధ్యాయ' 'బ్రహ్మశ్రీ' పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 142వ జయంతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థల అధినేత, సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్ గురువారం 'ప్రజాశక్తి'కి తెలిపారు. రోజూ ప్రముఖులచే సాయంత్రం ఆరు గంటల నుంచి సంగీత గాత్ర కచేరీలు జరుగుతాయన్నారు. లంక తేజస్వి, ఎన్వీ విజయ్ కుమార్ (ముంబై), డాక్టర్ మల్లెల పద్మ (న్యూజిలాండ్), మోదుమూడి సుధాకర్, పి.రుక్మిణి (తిరుచిరాపల్లి) గాత్ర కచేరీలకు-పెరవలి నందకుమార్, హేమాద్రి చంద్రకాంత్ (తిరుపతి), బి.వి.దుర్గాభవాని వయోలిన్‌పై, కె. కార్తికేయ ఆదినారాయణ శర్మ, కుందుర్తి అరవింద్, రాయప్రోలు సుధాకర్ (ఖమ్మం) మదంగంపై సహకరిస్తారని తెలిపారు. తొలి రోజు ప్రారంభ సభలో ప్రముఖ సంగీత విద్వాంసులు, 'పద్మశ్రీ' అన్నవరపు రామస్వామి ముగింపు రోజు "మా గురువుగారు" అంశంపై ప్రసంగిస్తారు. ఏడున "సునాద సుధానిధి" బిరుదు అందుకునే కొమ్మాజోశ్యుల సద్గురు చరణ్ 'కర్ణాటక సంగీత లయ వాద్యాలతో మాధుర్యం గణితం' అంశంపై సోదాహరణ ప్రసంగం చేస్తారు. మొత్తం కార్యక్రమాల్ని జయప్రదం చేయాలని.. విజ్ఞప్తి చేశారు.

## అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ : గాన గంధర్వులు, తెలుగు జాతికి గర్వకారకులు ఘంటసాల వెంకటేశ్వర రావు 104వ జయంతి సందర్భంగా గురువారం సాయంత్రం గాంధీనగర్ వి.హెచ్. గ్రంథాలయంలో "స్వర లయ", జి.ఎస్. మెలోడీ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి ఏర్పాటు చేశారు. ప్రముఖ ఔత్సాహిక యువ గాయనీమణులు బుగ్గేర్దం పద్మశ్రీ, బుగ్గేర్దం కష్ణశ్రీ, బేబి భావిజ్ఞ, నయన శ్రేష్ఠతో పాటు సీనియర్ గాయకుడు కేవీబీ ఆనంద్ వివిధ సినిమాల్లోని ఘంటసాల పాటలను వినులవిందుగా ఆలపించారు. ఘంటసాల సూపర్ హిట్స్ లో కొన్ని పాటలు ఆ యువతులు అద్భుతంగా పాడటం విశేషం. 'స్వరలయ' అధ్యక్షులు ఎస్.వి. రమణమూర్తి, కార్యదర్శి ఎస్.ఆర్. ప్రభాకర్ కార్యక్రమాన్ని నిర్వహించగా పి.మోహన్ రాంప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. జి.శ్రీనివాస్ ట్రాక్స్ సమకూర్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్ 'ఘంటసాల గాన సభ' అధ్యక్షుడు డాక్టర్ కేవీ రావుకు నిర్వాహకులు ఆత్మీయ సత్కారం చేశారు. 'ఘంటసాల గాన నిధి' (హైదరాబాద్)కు చెందిన నూకల ప్రభాకర్ సహకారంతో ఘంటసాల జీవిత విశేషాల దశ్య మాలిక ఏర్పాటు చేశారు.

## ఆకట్టుకున్న కచేరీ



విజయవాడ : గురువారం రాత్రి గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై డీజే రాము ఆధ్వర్యంలో "స్వరార్చన" సినీ సంగీత విభావరి ఆహ్లాదంగా జరిగింది. ఔత్సాహిక గాయనీ గాయకులు తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి (ప్రముఖ సిద్ధాంతి.. గుంటూరు), రాయరాజు, శర్మ, మల్లిక, మీనాకుమారి, సింగంపల్లి రమణ, గోవిందు, లక్ష్మణ నాయక్, శ్యామ్ ప్రసాద్ తదితరులు ఘంటసాల పాటలు ఆలపించి ప్రేక్షకుల్ని అలరించారు. కే డేవిడ్ రాజు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

## ఘనంగా ఘంటసాల జయంతి



విజయవాడ : 'జాషువా సాంస్కృతిక వేదిక' నిర్వహిస్తున్న "పాటల బడి" ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఎంబివికెలో ఘంటసాల జయంతి జరిగింది. మణిపాల్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ వైద్యులు కృష్ణారెడ్డి తొలుత ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంబివికె ప్రధాన నిర్వాహకులు బి.ఆర్.తులసీరావు, "జాషువా" కార్యదర్శి గుండు నారాయణరావు-ఘంటసాల విశిష్టత, జీవితంలో సంగీత ప్రాధాన్యం గురించి క్లుప్తంగా వివరించారు. "పాటల బడి" ప్రధాన శిక్షకుడు వి.బాలరాజు, పి.ఎన్.ఎమ్. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జి.వి.రంగారెడ్డి, సీనియర్ కళాకారుడు అప్పారావు, నటరాజ్, శాంతిరెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆహ్లాదంగా రాగలహరి



విజయవాడ : "ఆశీష్ ఈవెంట్స్" ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఆ గళం అమరం - ఆ గళం శాశ్వతం... ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా "నా పాట నీ నోట పలకాల సిలక" మకుటంతో 'రాగలహరి' నిర్వహించారు. ఔత్సాహిక గాయనీ గాయకులు సత్య స్వాతి, వి.ఎస్.కామేశ్వరి, శ్రీనివాస్, సూర్య, మున్నాభాయ్, గోవిందు తదితరులు ఘంటసాల పాటలు పాడి అలరించారు.

## శంభాల చిత్ర బృందం సందడి




ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ నగరంలో శంబాల చిత్ర బృందం సందడి చేసింది. ఒక సూపర్ నేచురల్ థ్రిల్లర్ నేపథ్యంలో తీసిన ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుందని హీరో ఆది తెలిపారు. స్టెల్లా కాలేజ్ సమీపంలోని ఏసీటీ ఫైబర్ నెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో ఆది మాట్లాడుతూ శంబాల ఒక మిస్టరీ థ్రిల్లర్‌గా ఉండి, 1980లలో ఒక గ్రామంలో ఉల్కాపాతం తర్వాత జరిగే అతీంద్రియ సంఘటనల చుట్టూ తిరుగుతుందన్నారు. పూర్తి గ్రామీణ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందని ఈ చిత్రానికి సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల ఇచ్చిన బ్యాగ్రౌండ్ మ్యూజిక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని వివరించారు. విజయవాడ నగరం నుంచి తమ ప్రమోషన్స్ ప్రారంభించడం ఆనందంగా ఉందని, దుర్గమ్మ దీవెనలతో ఈ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. హీరోయిన్ అర్చన మాట్లాడుతూ ఈ చిత్రంలో ఏ విధమైన అసభ్యకర సన్నివేశాలు ఉండవని, రొమాన్స్ సన్నివేశాలు కూడా లేవని ఒక సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో సాగుతుందన్నారు. నటుడు ఇంద్రనీల్ మాట్లాడుతూ తాను తొలిసారిగా వెండితెరపై పహిల్వాన్ క్యారెక్టర్‌లో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలిపారు. నటుడు శివ మాట్లాడుతూ ఈ నెల 25న విడుదల గ్రామం ఈ చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించే విజయవంతం చేయాలని కోరారు.



## నేషనల్ త్రోబాల్‌కు ఖుషిక ఎంపిక

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వివిధ జిల్లాలకు చెందిన అండర్ 17 విద్యార్థులకు నిర్వహించిన త్రోబాల్ పోటీలలో గుంటుపల్లి సెయింట్ ఆన్స్ హై స్కూల్ (సిబిఎస్) విద్యార్థిని కె ఖుషిక ఆంధ్ర జట్టు తరపున కేరళలో జరగబోవు నేషనల్ త్రోబాల్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా తమ పాఠశాల తరపున ఎంపికైన ఖుషికను ప్రిన్సిపల్ సిస్టర్ జెన్ ఆంటోనీ అభినందిస్తూ, తమ విద్యార్థులకు అవసరమైన తర్ఫీదు ను సహకారాన్ని ఎల్లప్పుడూ అందజేస్తామని తెలియజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. తనను ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్ సాయికుమార్ కు విద్యార్థిని ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.

## గెలాక్సీ ట్యాబ్ ఎ1 విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్ బ్రాండ్ శామ్‌సంగ్, గెలాక్సీ ట్యాబ్ ఎ11ను విడుదల చేసినట్లు సంస్థ మార్కెటింగ్ ఇంచార్జి ఎల్.రాజేశ్వర్ తెలిపారు. నగరంలోని శాంసంగ్ స్టోర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వయసుల వినియోగ దారులకు అవసరమైన వినోదం, సున్నితమైన పనితీరు, వైవిధ్యతను మిళితం చేసుకున్న గెలాక్సీ ట్యాబ్ ఎ11.. 8.7" డిస్‌ప్లేతో 90 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్‌ను కలిగి ఉంటుందని తెలిపారు. గెలాక్సీ ట్యాబ్ ఏ11 డాల్బీ-ఇంజనీర్డ్ డ్యూయల్ స్పీకర్‌లను కూడా కలిగి ఉందని, ఇవి సినిమాలు, సంగీతం, వీడియో కాల్‌కు అనువైన ఆడియోను అందిస్తాయన్నారు. గెలాక్సీ ట్యాబ్ ఏ 11 సామ్‌సంగ్ డాట్ కాం, అమెజాన్, ఫ్లిప్ కార్ట్, రిటైల్ స్టోర్‌లలో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## స్కూల్ గేమ్స్ పోటీల్లో నున్న విద్యార్థుల ప్రతిభ

విజయవాడ రూరల్ : ఈ ఏడాది విద్యా సంవత్సరంలో జరిగే స్కూల్ గేమ్స్ జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్లకు వివిధ క్రీడల్లో 13 మంది నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి రవి ప్రసాద్ తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు గురువారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ ఎంఇఒ ఎం.వెంకటరత్నం మాట్లాడుతూ నున్న పాఠశాల విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని కొనియాడారు. ఈ ఏడాది జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో డి.అమర్ కుమార్, డి.సిమ్రాన్, కె.మహాలక్ష్మి.టి. స్నేహలత లు బంగారు పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. సైక్లింగ్‌లో జె.లోహిత్ కుమార్, డి.డి.జస్వంత్, టి.జయశ్రీ, డి.సంతోష్, ఏ.మీనాక్షి, టి.చిట్టెమ్మ జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రగ్బీలో డి అమర్ కుమార్, బి.భావన, జూడోలో టి.చిట్టెమ్మ జాతీయ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు టి.శ్రీలత, విజయ వర్మ తెలిపారు.

## ఆస్టర్ రమేష్ హాస్పిటల్లో అరుదైన గుండె శస్త్ర చికిత్స



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో దేశంలోనే తొలిసారిగా రోగిని మెలకువలో ఉంచి గుండె బైపాస్ సర్జరీ విజయవంతంగా చేసినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు తెలిపారు. రింగ్ రోడ్డు వద్ద గల ఆస్టర్ రమేష్ హాస్పిటల్లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వైద్య బృందం వైద్య రంగంలో అరుదైన మైలురాయిని నమోదు చేసిందని తెలిపారు. భారతదేశంలోనే తొలిసారిగా 76 ఏళ్ల మయాస్థీనియా గ్రేవిస్ రోగికి మేల్కొని ఉన్న స్థితిలో గుండె బైపాస్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అత్యంత క్లిష్ట పరిస్థితిలో ఉన్న రోగికి గుండెకు రక్తం సరఫరా చేసే మూడు ప్రధాన ధమనుల్లో తీవ్రమైన పూడికలు ఉండటమే కాకుండా, శ్వాసకోశ కండరాలను బలహీనపరిచే మయాస్థీనియా గ్రేవిస్ వ్యాధి కూడా ఉందన్నారు. ఇటువంటి రోగులకు జనరల్ అనస్థీషియా ఇవ్వడం ప్రాణాంతకమయ్యే అవకాశం ఉన్నందున, వైద్య బృందం మేల్కొని ఉన్న స్థితిలో గుండె బైపాస్ చికిత్సను ఎంచుకుందని తెలిపారు. ఈ పద్ధతిలో రోగి శస్త్రచికిత్స జరుగుతున్నంత సేపు మొత్తం స్పృహతో ఉండి, స్వయంగా శ్వాస తీసుకుంటారని వెల్లడించారు. థొరాసిక్ ఎపిడ్యూరల్ అనస్థీషియా ద్వారా ఛాతీ భాగానికి మాత్రమే మత్తు ఇవ్వడం జరిగిందని, వెంటిలేటర్ అవసరం లేకుండా శస్త్రచికిత్స సజావుగా ముగిసిందని తెలిపారు. హాస్పిటల్స్‌లోని అత్యుత్తమ కార్డియోథొరాసిక్, వాస్క్యులర్ సర్జన్స్ వైద్య బృందం డాక్టర్ జయరామ్ పాయ్, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ భరత్ సిద్ధార్థ్, డాక్టర్ శ్రీకాంత్ మహాపాత్ర, అనస్థీషియా బృందం డాక్టర్ లోగనాథన్ చక్రవర్తి, డాక్టర్ పవన్, డాక్టర్ హిమబిందు విజయవంతంగా పూర్తి చేశారని, ఈ సందర్భంగా వైద్య బృందాన్ని అభినందించారు. రమేష్ హాస్పిటల్లో అంతర్జాతీయ స్థాయి వైద్య ప్రమాణాలతో శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని తెలిపారు. గత 37 సంవత్సరాలుగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో ఇప్పటి వరకు 25 వేలకుపైగా గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తయ్యాయని పేర్కొన్నారు. శస్త్రచికిత్స పూర్తిగా విజయవంతమై, రోగి ఆరోగ్యంగా కోలుకుంటున్నారని తెలిపారు.